Sweken
WE ARE HIRING !!
POWER BI SPECIALIST
DATA ANALYST
INTERESTED CANDIDATES PLEASE SEND YOUR RESUME TO MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 148 విశాఖపట్నం, 22 మార్చి 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

విలేఖరులు కావలెను
విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 7013785256, 9959867303

## అన్ని రాష్ట్రాల రాజధానుల్లో
# శ్రీవారి ఆలయాల నిర్మాణం

- సీఎం చంద్రబాబు వెల్లడి
- తిరుమలలో స్వామివారి సేవలో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు



**తిరుమల:** ప్రతిరోజు ఎంతో మంది భక్తులు తిరుమలకు వస్తున్నారని.. అన్నదానానికి చాలా మంది వితరణ ఇస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. మనవడు నారా దేవాంశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తరిగొండ వెంగమాంబ సత్రంలో దేవాంశ్ పేరుతో అన్నదానం నిర్వహించారు. చంద్రబాబు, కుటుంబ సభ్యులు ప్రసాదాలు వడ్డించారు. అనంతరం చంద్రబాబు టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించి మీడియాతో మాట్లాడారు. "భక్తులకు ప్రసాదాలు వడ్డిస్తే వచ్చే తృప్తి వెలకట్టలేనిది. సమాజ హితం కోసం అందరూ పనిచేయాలి. ఏడు కొండలు.. వేంకటేశ్వరస్వామి సొంతం. ఈ ఏడు కొండల్లో ఎలాంటి అపవిత్ర కార్యక్రమాలు జరగకూడదు. నేను ఎప్పుడూ ప్రజాహితం కోసం పనిచేస్తా. తిరుమలలో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించా. గతంలో ముంతాజ్ హోటల్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తున్నాం. ఏడుకొండలను ఆనుకొని ఎక్కడా కమర్షియలైజేషన్ ఉండకూడదు. వేంకటేశ్వరస్వామి ఆస్తులను కాపాడటమే ...(మిగతా 2లో)

## ఐపీఎల్ పోరుకు
# వేళాయె!
### ఓపెనింగ్ మ్యాచ్‌కు వర్షం ముప్పు!



కోల్‌కతా : ఐపీఎల్–2025 ఆరంభానిక శనివారం నుంచి తెర లేవనుంది. ఓపెనింగ్ మ్యాచ్‌లో డిఫెండిరగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ ఆరంభ మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్నది.

...(మిగతా 2లో)

- మరిన్ని వార్తలు 8లో



## ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం
2

# కాయ్ రాజా.. కాయ్..!






- ఐపీఎల్‌లో వేల కోట్ల బెట్టింగ్‌లు
- నిషేధం ఉన్నా యథేచ్ఛగా క్రికెట్ యాప్‌ల జోరు
- ఫ్రాంచైజీ యాజమాన్యాల అండదండ!
- బీసీసీఐ తెలిసే తెరవెనక బాగోతాలు?

**విశాఖసమాచారమ్ స్పోర్ట్స్ డెస్క్:** కంచే చేను మేయడం అంటే తెలుసుగా.. ఎవరైతే రక్షణగా ఉండాలో.. వాళ్లే దోచేయడం. అలాంటిదే ఐపీఎల్‌లో జరిగింది. క్రికెట్ బెట్టింగ్ యాప్‌లకు ఏకంగా బీసీసీఐ మద్దతుగా ఉండటం.. ఫ్రాంచైజీ యాజమాన్యాలే బెట్టింగ్‌లకు పాల్పడటం ఐపీఎల్‌లో పెద్ద విషాదం. క్రీడల్లో బెట్టింగ్ సర్వసాధారణం. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న వ్యవహారమే. మన దేశంలో కూడా అనధికారికంగా బెట్టింగ్స్ జరుగుతున్నాయి. ఆస్ట్రేలియా, యూకే, సౌత్ ఆఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక వంటి దేశాల్లో బెట్టింగ్‌ను ఆయా ప్రభుత్వాలు చట్టబద్ధం చేశాయి. కానీ అసలు బెట్టింగ్‌పై నిషేధం ఉన్న భారత్‌లో మాత్రం.. ఆ దేశాల కంటే ఎక్కువగా బెట్టింగ్‌లు పెడుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఒక వైపు



తెలంగాణ రాష్ట్ర పోలీసులు బెట్టింగ్ యాప్స్‌ను నిషేధించారు. వాటిని ప్రచారం చేస్తున్న వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. కానీ ప్రభుత్వ అనుమతి ఉందంటూ 'ఫాంటసీ లీగ్' పేరుతో అనేక యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. కేవలం రూ.40, రూ.50, రూ.60 వంటి చిన్న మొత్తాలే అంటూ ఆకర్షించి.. ఆ తర్వాత యూజర్లను బెట్టింగ్‌కు పూర్తిగా అలవాటు చేస్తాయి. విషయం ఏంటంటే.. ఇలా బెట్టింగ్‌లు నడిపే 'డ్రీమ్ 11' అనే సంస్థ 2020లో ఐపీఎల్‌కు టైటిల్ స్పాన్సర్‌గా ఉంది. ఇప్పుడు మై 11 సర్కిల్ అనే సంస్థ ఐపీఎల్ ఫాంటసీ లీగ్ భాగస్వామిగా ఉంది. 2028 వరకు అధికార ఫాంటసీ స్పోర్ట్ పార్ట్‌నర్‌గా ఉండేదుకు రూ.625 కోట్లు చెల్లించింది.

### ఏంటీ ఫాంటసీ లీగ్స్?

మన దేశంలో డ్రీమ్ 11, మై11సర్కిల్, ఎంపీఎల్, ఫ్యాన్ ఫైట్, క్రిక్‌ప్లే, మైటీమ్ వంటి ఫాంటసీ లీగ్ యాప్స్ అనేకం ...(మిగతా 2లో)



# ప్రిస్క్రిప్షన్ లేకుండా డ్రగ్స్ విక్రయిస్తే చర్యలు

### – ఈగల్ చీఫ్ రవికృష్ణ హెచ్చరిక

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** మత్తును కలిగించే ఔషధాల విక్రయాలపై ఈగల్ విభాగం పోలీసులు నిఘా పెట్టారు. ఔషధాల దుర్వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి అధికారులు తనిఖీలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వంద బృందాలతో మెడికల్ షాపులు, ఏజెన్సీల్లో ఐజీ ఈగల్ టీమ్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. ఆపరేషన్ గరుడలో భాగంగా డీజీపీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుల సంయుక్తంగా విజయవాడలోని భవానీపురం, గుణదల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. సైకోటిక్ మెడిసిన్‌ను ...(మిగతా 2లో)

## విశాఖకు 4 నెలల్లో
# కొత్త మాస్టర్ ప్లాన్

### - మంత్రి నారాయణ



**అమరావతి, విశాఖపట్నం (విశాఖ సమాచారమ్):** నాలుగు నెలల్లో విశాఖ మహానగర పాలక సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. విశాఖ కొత్త మాస్టర్ ప్లాన్‌పై సచివాలయంలో అధికారులు, విశాఖ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మే నెలాఖరులోగా విశాఖ మెట్రో రైలు టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడిరచారు. ఫైనాన్షియల్ సిటీ విశాఖ మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించినట్లు తెలిపారు. ప్రజలు, నేతల అభిప్రాయాలతో నాలుగు నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు తెలిపారు. విశాఖ మెట్రో రైల్‌పైనా సమావేశంలో చర్చించామన్నారు. టీడీఆర్ బాండ్ల విషయంలో గతంలో అక్రమాలు జరిగాయని.. విశాఖలో 600కు పైగా టీడీఆర్ బాండ్లు పెండిరగ్‌లో ఉన్నట్లు చెప్పారు. వీటిని విశాఖ కలెక్టర్ త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయానికి ఇబ్బంది లేకుండా రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ ...(మిగతా 2లో)




# బెట్టింగ్ చిక్కుల్లో బాలకృష్ణ!

- అన్ స్టాపబుల్ షోలో బెట్టింగ్ యాప్ ప్రమోషన్
- అల్లు ఫ్యామిలీకి మళ్లీ షాక్ తప్పదా?

**హైదరాబాద్, (విశాఖసమాచారమ్):** తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ వ్యవహారం దుమారం రేపుతోంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారన్న కారణంగా పలువులు టాలీవుడ్ యాక్టర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు, యాంకర్లపై పోలీసులు కేసులు నమోదు చేసి విచారిస్తుండగా తాజాగా ఈ వ్యవహారంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ నందమూరి బాలకృష్ణ పేరు తెరపైకి రావడం టాలీవుడ్‌లో కలకలం రేపుతోంది. బాలయ్య హోస్ట్ చేస్తున్న అన్ స్టాపబుల్ షోలో బెట్టింగ్ యాప్‌పై ప్రచారం చేశారనే ఆరోపణలు సంచలనంగా మారాయి. ఓ వైపు ఈ కేసును తెలంగాణ పోలీసులు ...(మిగతా 2లో)





## జీవీఎంసీ స్థాయి సంఘంలో
# 101 అంశాలకు ఆమోదం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్) :** జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం జీవీఎంసి ప్రధాన కార్యాలయం స్థాయి సంఘం సమావేశ మందిరంలో స్థాయి సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో 104 అంశాలు పొందుపరిచారని, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించిన పిదప ఒక అంశం వాయిదా వేయగా, 2 అంశాలు సభ్యులు తిరస్కరించారని, మిగిలిన 101 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి ఉన్నాయని వాటిని చర్చించిన పిదప సభ్యులు ఆమోదం తెలిపారని చైర్ పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి బి.వి.రమణ, వ్యయ పరిశీలకులు సి.వాసు దేవ రెడ్డి, జోనల్ కమిషనర్లు ప్రేమ ప్రసన్నవాణి ,శివప్రసాద్, మల్లయ్య నాయుడు, ...(మిగతా 2లో)

## అమెరికా నుంచి త్వరలో మరో 295 మంది
# అక్రమ వలసదారుల రాక



**అమెరికా :** అమెరికాకు అక్రమంగా వలస వెళ్లిన భారతీయుల్లో మరో 295 మంది త్వరలోనే స్వదేశానికి తిరిగి రానున్నారని కేంద్రం తాజాగా వెల్లడించింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. దీంతో విడతల వారీగా పలువురు స్వదేశానికి తిరిగొచ్చారు. త్వరలో మరో 295 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అక్రమ వలసల అంశంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. ఈ సందర్భంగా భారత్‌కు పంపించిన వలసదారుల పట్ల అమెరికా అధికారులు వ్యవహరించిన తీరుపైనా కేంద్రం స్పందించింది. దీనిపై తమ ఆందోళనను అగ్రరాజ్యానికి తెలియజేసినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 5న భారత్‌కు పంపించిన అక్రమ వలసదారులకు, ముఖ్యంగా మహిళలకు సంకెళ్లు వేసిన అంశాన్ని అమెరికా వద్ద లేవనెత్తినట్లు తెలిపింది. దీనికి అగ్రరాజ్యం కూడా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించింది. "భారత్ ఆందోళనల తర్వాత ఫిబ్రవరి 15, 16 తేదీల్లో పంపించిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని అమెరికా ధ్రువీకరించింది. వలసదారులు స్వదేశానికి చేరుకున్న తర్వాత వారితో చర్చించి మన అధికారులు కూడా దీన్ని ...(మిగతా 2లో)

# జనసేనలో చేరిన వైసీపీ కార్పొరేటర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 36 వ వార్డుకు చెందిన వైసీపీ కార్పొరేటర్ మాసిపోగు మేరీ జోన్స్, రాజు దంపతులు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ విధానాలు, కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమంపై ఆకర్షితులై పార్టీలో చేరామని కార్పొరేటర్ దంపతులు తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ అధినేత పవన్ కల్యాణ్ నిరంతరం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.

# హనీట్రాప్ రగడ

- 18 మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు
- కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం



**బెంగళూరు:** కర్ణాటకలో మంత్రులు సహా అనేక మంది ముఖ్యనేతలే లక్ష్యంగా కొనసాగుతోన్న 'హనీ ట్రాప్' వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. దీనిపై శుక్రవారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది. సమావేశాల వేళ ప్రతిపక్ష బిజెపి నేతలు ఈ అంశాన్ని లేవనెత్తడంతో తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. దాంతో సభా కార్యక్రమాలకు అడ్డుపడిన 18 మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూ తీర్మానం చేశారు. ఆరు నెలల పాటు వారిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు.

సంచలనంగా మారిన 'హనీ ట్రాప్' వ్యవహారాన్ని శుక్రవారం బిజెపి నేతలు లేవనెత్తారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. హనీ ట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడాన్ని విమర్శిస్తూ.. స్పీకర్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. భాజపా నేతల తీరుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకసారి కేసు నమోదై.. దర్యాప్తు ప్రారంభమైతే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందినవారు ఈ బాధితుల్లో ఉన్నారన్నారు. అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఇక, సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రకారం.. వేటుకు గురైన సభ్యులు అసెంబ్లీ హాల్, లాబీ, గ్యాలరీలోకి ప్రవేశించకూడదు. వారు ఏ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పాల్గొనకూడదు. అసెంబ్లీ ఎజెండాలో వారి పేర్లతో ఎలాంటి అంశం లిస్ట్ కాకూడదు. ఈ సమయంలో వారికి రోజూవారీ భత్యాలు కూడా అందవు. ఇక సస్పెండైన ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటకు తరలించారు.

# ఉపాధి హామీ పథకంపై డిప్యూటీ సీఎం సమీక్ష



**వీడియో కాన్ఫరెన్‌లో పాల్గొన్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు**

**విశాపట్టణం:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, దాని పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షించారు. శుక్రవారం సచివాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన వీసీలో ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకం అమల్లో పూర్తి పారదర్శకత పాటించి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యధిక పనిదినాలు కల్పించాలని, ఆర్థికంగా భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయ భూముల్లో నీటికుంటల ఏర్పాటు, పండ్ల తోటల పెంపకం, పచ్చదనం పెంపుదలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పల్లెపండగలో భాగంగా చేపట్టిన పనులను పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచి ప్రజలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తమ పరిధిలో ఉన్నతంగా ఆలోచించి ప్రభుత్వ పథకాలను నిష్పక్షపాతంగా, పారదర్శంగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లు, ఉన్నతాధికారులపై ఉందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఏపీవిశాఖపట్టణం కలెక్టరేట్ వీసీ హాలు నుంచి భాగస్వామ్యమైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్థానికంగా చేపడుతున్న చర్యలను వివరించారు. మరిన్ని ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. జడ్పీ సీఈవో, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ, పంచాయతీ రాజ్ ఎస్.ఈ., డీపీవో, డ్వామా పీడీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కేంద్ర క్రీడా శాఖా మంత్రి ని కలిసిన ఎంపీ శ్రీభరత్

**విశాఖపట్నంలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కృషి చేయాలని వినతి**



**విశాఖపట్నం:** విశాఖపట్నంలో క్రీడా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, కీలక ప్రతిపాదనలను చర్చించడానికి ఎంపీ శ్రీ భరత్ క్రీడా, యువజన శాఖా మంత్రి మాన్ సుఖ్ మాండవీయాను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా పథకం క్రింద ఆరిలోవ లో మల్టీ పర్పస్ ఇన్డోర్ హాల్ మరియు నేషనల్ సెంటర్ అఫ్ ఎక్సెన్స్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

చినగదిలి వద్ద అత్యాధునిక మల్టీపర్పస్ ఇండోర్ హాల్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్, విశాఖపట్నం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ సమర్పించిన ప్రతిపాదనను ఆమోదించాలని ఎంపీ కోరారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, జూడో, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్ మరియు కబడ్డీ వంటి క్రీడా విభాగాల కోసం ఈ ప్రణాళిక రూపొందించబడింది. ఈ సౌకర్యం ఔత్సాహిక అథ్లెట్లకు ఆధునిక శిక్షణ సౌకర్యాలు మరియు అధునాతన మౌలిక సదుపాయాలను అందించడం, వారి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం , జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడటానికి సహాయపడుతుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖపట్నంలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపనకు కూడా ఎంపీ శ్రీభరత్ మంత్రికి అభ్యర్థించారు.

## జీవీఎంసీ స్థాయి సంఘంలో 101 అంశాలకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

బి.రాము, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చిరంజీవి, గంగాధర్ రావు, సుధాకర్, అప్పారావు, సహాయ వైద్యాధికారులు డాక్టర్ ఎన్.కిషోర్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ అప్పలనాయుడు , డాక్టర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా నుంచి త్వరలో మరో 295 మంది అక్రమ వలసదారుల రాక

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారించుకున్నారు. ఇక, అమెరికాలో చట్టవ్యతిరేకంగా నివాసం ఉంటున్న వారిలో మరో 295 మంది భారతీయులు త్వరలోనే స్వదేశానికి రానున్నారు. ప్రస్తుతం సంబంధిత ఏజెన్సీలు వారి వివరాలను పరిశీలిస్తున్నాయి" అని విదేశాంగశాఖ తమ సమాధానంలో పేర్కొంది.

ఫిబ్రవరి 5 నుంచి ఇప్పటివరకూ 388 మంది భారత అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో అగ్రరాజ్యం వెనక్కి పంపింది. వీరిలో అత్యధికంగా 40 శాతం మంది పంజాబ్ వాసులు కాగా.. 34 శాతం హరియాణాకు చెందిన వారు ఉన్నారు. అయితే, వీరి చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులతో బంధించి పంపడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కేంద్రం కూడా స్పందించింది. మరోవైపు, ఈ డిపోర్టేషన్ ప్రక్రియ కొన్నేళ్ల నుంచి సాగుతోందని ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. 2009 నుంచి 2024 వరకు దాదాపు 15,500 మందిని అమెరికా వెనక్కి పంపించినట్లు గుర్తుచేసింది.

# ఐపీఎల్ పోరుకు వేళాయె!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభ వేడుకల కోసం బీసీసీఐ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే, ఓపెనింగ్ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. గేమ్‌కు వరుణుడు ఆటంకం కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శనివారం 80 శాతం వర్ష పడేందుకు అవకాశం ఉందని వాతావరణ నివేదికలు అంచనా వేశాయి. కోల్‌కతాలో ఉరుమెలు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడనున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. రాత్రి 7:30 గంటలకు మ్యాచ్ ప్రారంభంకానుంది. గేమ్ ప్రారంభానికి కంటే ముందు నుంచే వర్షం పడే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు ఓపెనింగ్ సెర్మనీని భారీగా నిర్వహించనున్నారు. వర్షం కారణంగా మ్యాచ్‌కు ఆటంకం ఏర్పడితే అభిమానులకు తీవ్ర నిరాశ తప్పదు.

# ప్రిస్క్రిప్షన్ లేకుండా డ్రగ్స్ విక్రయిస్తే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ హెచ్చరించారు. అల్ప్రాజోలమ్, ట్రెమడాల్ లాంటి సైకోటిక్ మెడిసిన్‌ను అనధికారికంగా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఈ దాడులు నిర్వహించారు.

**తూ.గో జిల్లాలో 16చోట్ల సోదాలు**

డ్రగ్స్ తరహాలో వాడేందుకు కొన్ని రకాల టాబ్లెట్లు, ఇంజెక్షన్లను మెడికల్ షాపుల నుంచి యువత కొనుగోలు చేస్తున్నట్లు సమాచారంతో అధికారులు మెడికల్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో 16 చోట్ల తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ ఎస్పీ స్నేహిత, డ్రగ్స్ ఏడీ నాగమణి తెలిపారు. రాజమండ్రి గణేష్ చౌక్ వద్ద తిరుమల శ్రీనివాస్ మెడికల్ ఏజెన్సీలో 255 ట్రెమడాల్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ ఏజెన్సీలో, మెడికల్ షాపుల్లో ఈ ఇంజెక్షన్లు, మత్తు కలిగించే సిరప్‌లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

మా లక్ష్యం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాలను కట్టాలని నిర్ణయం తీసుకున్నాం" అని అన్నారు.

**శ్రీవారి సేవలో..**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు నారా దేవాంశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు సీఎంకు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అర్చకులు లాంఛనంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలిచ్చారు. తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం తరిగొండ వెంగమాంబ సత్రంలో దేవాంశ్ పేరుతో అన్నదానం నిర్వహించారు. చంద్రబాబు, కుటుంబ సభ్యులు ప్రసాదాలు వడ్డించారు. మధ్యాహ్నం తిరుమల నుంచి బయలుదేరి చంద్రబాబు హైదరాబాద్‌కు వెళ్లారు.

# విశాఖకు 4 నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా డీవియేషన్ జరిగిందని మంత్రి తెలిపారు. విశాఖపట్నం మాస్టర్ ప్లాన్ లో మార్పులు, చేర్పులపై ప్రధానంగా చర్చించారు. విశాఖలో టీడీఆర్ బాండ్లను త్వరితగతిన జారీ చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. విశాఖలో మెట్రో రైల్ కారిడార్లు పొడిగింపు అంశాన్ని పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్, వంశీ కృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, ఏపీ యుఎఫ్ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ గోపాల్, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆన్‌లైన్‌లో పాలుపంచుకున్నారు. అలాగే మంత్రి సమీక్షలో విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగు హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ సీసీపీ ప్రభాకర్, అదనపు కమిషనర్లు వర్మ, సోమన్నారాయణ, సీఈ, ఎస్ఈ, జోనల్ కమిషనర్లు ఇతర అధికారులు భాగస్వామ్యులయ్యారు.

## ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

**సింహాచలం :** ఏపీలో సింహాచలం దేవస్థానంలో వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం (నిజరూప దర్శనం) వచ్చే నెల 30వ తేదీన జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. చందనోత్సవానికి భారీఎత్తున భక్తులు హాజరుకానున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. చందనోత్సవం నేపథ్యంలో ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి దర్శనాలు నిలిపివేయాలని, భక్తులకు ఈ విషయం తెలియజేయాలని అధికారులకు సూచించారు.

# కాయ్.. రాజా కాయ్..!

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా చిన్నా చితకా యాప్స్ మరో 150 వరకు ఉంటాయి. వీటి మార్కెట్ వాల్యూ రూ.లక్ష కోట్లు అంటే అతిశయోక్తి కాదు. ప్రతీ రోజు లైవ్ మ్యాచ్‌తో పాటే సరదాగా ఫాంటసీ లీగ్ ఆడాలంటూ ఇవి యాడ్స్ కూడా ఇస్తుంటాయి. ఈ ఫాంటసీ లీగ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లతో ఒక టీమ్‌ను తయారు చేసుకోవాలి. మనం సెలెక్ట్ చేసుకున్న ఆటగాళ్లు మ్యాచ్‌లో చేసే ప్రదర్శన ఆధారంగా మనకు పాయింట్లు లభిస్తాయి. ఈ ఫాంటసీ లీగ్స్‌ను ఉచితంగానే ఆడవచ్చని ముందు యాప్స్ ఆకర్షిస్తాయి. అదే సమయంలో కనీసం రూ.35 నుంచి రూ.5 వేల వరకు పెట్టి ఆడే కేటగిరీలు కూడా ఉన్నాయని చూపిస్తుంటాయి.

రూ.కోట్లలో ప్రైజ్ మనీ లభిస్తుందని యూజర్లను ఆకర్షిస్తుంటాయి. అయితే కనీసం రూ.50 పెట్టి ఆడేవాళ్లు ఓడిపోయినా పెద్దగా పట్టించుకోరు. కానీ అవే ఈ ఫాంటసీ లీగ్ యాప్స్‌కు కోట్లాది రూపాయల లాభాలు తెచ్చిపెడుతున్నాయి. సాధారణంగా బెట్టింగ్స్‌లో పంటర్లు, మిడిల్ మ్యాన్, బుకీలంటూ పెద్ద వ్యవస్థే ఉంటుంది. కానీ ఫాంటసీ లీగ్స్‌లో పేరుతో అనధికార బెట్టింగ్ నిర్వహించే ఈ సంస్థలు నేరుగా యూజర్లతో కనెక్ట్ అయ్యి ఉంటాయి. 2020లో టాప్ ఐదు ఫాంటసీ లీగ్ సంస్థలు ఏకంగా రూ.450 కోట్ల జీఎస్టీని చెల్లించాయంటే వీటికి ఎంత ఆదరణ ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే 2023లో ఆన్‌లైన్ గేమింగ్ యాప్స్‌పై 28 శాతం జీఎస్టీ విధించాలని కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో చాలా యాప్స్ ఆన్‌లైన్ గేమింగ్ నుంచి తప్పుకున్నాయి.

**ఏపీ, తెలంగాణలో నిషేధం..**

కేంద్ర ప్రభుత్వం డ్రీమ్11, మై11సర్కిల్ వంటి యాప్స్‌కు అనుమతులు ఇచ్చింది. అనుమతులు లేని యాప్స్ కూడా ఏపీకే లింక్స్ రూపంలో ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంటాయి. అయితే కేంద్రం అనుమతులు ఇచ్చిన ఫాంటసీ లీగ్ యాప్స్ ఏపీ, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో డౌన్‌లోడ్ అయినా.. వాటిలో డబ్బు పెట్టి ఆడటానికి అనుమతి లేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, అసోం రాష్ట్రాల్లో డబ్బులు పెట్టి డ్రీమ్ 11 లో ఆడటానికి వీలుండదు. అలాగే సిక్కిం, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఈ యాప్స్‌పై అనేక ఆంక్షలు ఉన్నాయి. మై 11 సర్కిల్ వంటి ఫాంటసీ లీగ్ యాప్‌కు గతంలో గంగూలీ, శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి వారు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారు. ప్రస్తుతం యువ క్రికెటర్లు రింకూ సింగ్, యశస్వీ జైస్వాల్ బ్రాండ్ పార్ట్‌నర్లుగా ఉన్నారు. ఇలా బీసీసీఐ స్వయంగా ఫాంటసీ లీగ్ యాప్స్‌తో జతకట్టి.. అభిమానులను బెట్టింగ్‌ల వైపు ప్రోత్సహిస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి.

**బెట్టింగ్ భూతం..**

ఒక వైపు ఫాంటసీ లీగ్స్ పేరుతో కొన్ని యాప్స్ అధికారికంగానే అభిమానులతో బెట్టింగ్స్ పెట్టిస్తుంటే.. ఇక అనధికారికంగా జరిగే బెట్టింగ్ మాత్రం ఎప్పటిలాగే రూ.వేల కోట్లను వెనకేసుకుంటోంది. క్రికెట్ వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ సమయంలో కంటే ఐపీఎల్ జరిగే సమయంలోనే ఈ బెట్టింగ్ మాఫియా వేలాది కోట్ల రూపాయలను కొల్లగొడుతోంది. ఇండియాలో బెట్టింగ్ మార్కెట్ విలువ ఏడాదికి రూ.11 లక్షల కోట్లు దాటిపోయింది. ఇండియాలో ఇలాంటి ఇల్లీగల్ బెట్టింగ్ మార్కెట్ 2024 లో 100 బిలియన్ డాలర్ల మేర కొల్లగొట్టింది. ప్రతి ఏటా ఈ ఇల్లీగల్ బెట్టింగ్ మార్కెట్ వాల్యూ 30 శాతం మేర పెరుగుదల ఉందని సెంటర్ ఫర్ నాలెడ్జ్ సావెరినిటీ (సీకేఎస్) అనే సంస్థ తెలియజేసింది. ఐపీఎల్ మ్యాచ్‌ల ద్వారా ఈ బెట్టింగ్ మాఫియాకు వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుండటంతో ఏకంగా ఫిక్సింగ్‌కు కూడా తెరలేపాయి. బాల్ టు బాల్.. ఓవర్ టు ఓవర్.. బెట్టింగ్స్ జరుగుతున్నాయి. టాస్ నుంచి ఈ బెట్టింగ్స్ మొదలవుతుంటాయి. ఈ ఓవర్‌లో ఏం జరుగుతుంతో చూసే ప్రేక్షకులకు తెలియదు. కానీ ఫిక్సర్లకు మాత్రం ముందే తెలిసిపోతుంటాయి. అందుకే ప్రతీ బాల్‌పై ఎంత పెట్టాలో వాళ్లే ఫిక్స్ చేస్తుంటారు. బెట్టింగ్ మాఫియా, ఫిక్సర్ల చేతుల్లోకి గతంలో ఐపీఎల్ ఫ్రాంచైజీల నిర్వాహకులు కూడా వెళ్లిపోయారు.

**ఫిక్సింగ్ ఆరోపణలు ఇలా..**

ఐపీఎల్‌లో కూడా ఫిక్సింగ్ వ్యవహారాలు బయటపడ్డాయి. ఐపీఎల్‌లో గతంలో చాంపియన్లుగా నిలిచిన రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల యాజమాన్యాలు ఫిక్సింగ్‌లో భాగస్వామ్యమయ్యాయనే కారణంతో రెండేళ్ల పాటు నిషేధాన్ని కూడా ఎదుర్కొన్నాయి. ఈ రెండు ఫ్రాంచైజీల నిషేధానికి కారణం స్పాట్ ఫిక్సింగే. ఇల్లీగల్ బెట్టింగ్, స్పాట్ ఫిక్సింగ్‌లో ఆటగాళ్లు, యాజమాన్యంలోని కీలక వ్యక్తులు భాగస్వామ్యం అయినట్లు గుర్తించడం వల్లే నిషేధం విధించినట్లు సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అప్పట్లో ఫిక్సింగ్‌లో భాగస్వామ్యం అయిన ప్రముఖ ఆటగాడు శ్రీశాంత్‌పై కూడా జీవితకాలం బ్యాన్ విధించింది. ఆ తర్వాత కాలంలో దీన్ని ఏడేళ్లకు కుదించారు. ఈ అక్రమాలు బయటకు వచ్చిన తర్వాత బీసీసీఐ ప్రత్యేకంగా గుజరాత్ మాజీ డీజీపీ అజిత్ సింగ్ నేతృత్వంలో యాంటీ కరప్షన్ యూనిట్ ఏర్పాటు చేసింది.

**ఫిక్సింగ్ చేసేదిలా..**

ఒక మ్యాచ్ ఫిక్స్ చేయడం అంత ఈజీ కాదు. దీని వెనుక ఫ్రాంచైజీకి చెందిన వ్యక్తులు, క్రికెటర్ల సహకారం తప్పనిసరి. బౌలర్, బ్యాటర్, బుకీలకు మధ్య కొన్ని సంకేతాల ద్వారా సమాచార మార్పిడి జరుగుతుందని గతంలో పట్టుబడిన ఆటగాళ్లు చెప్పారు. గ్రౌండ్‌లో ఉండే ఎల్ఈడీ స్క్రీన్లను కూడా ఫిక్సింగ్ కోసం ఉపయోగిస్తుంటారు. బౌలర్ కర్చీఫ్ తీసి తుడుచుకోవడం, బ్యాటర్ పిచ్ మధ్యకు వచ్చి బ్యాటుతో కొట్టడం, స్కోర్ బోర్డుపై బౌలర్ లేదా బ్యాటర్ పక్కన చుక్కలు పెట్టడం.. ఇలాంటి సంకేతాల ద్వారా తర్వాత ఏం చేయాలో చెప్తుంటారు. దానికి అనుగుణంగానే బంతి వైడ్ లేదా నోబాల్ వేయడం.. బ్యాటర్ సిక్స్ లేదా ఫోర్ కొట్టడం. లేదంటే అవుట్ కావడం జరుగుతుంటుంది. ఇలాంటి సమయంలోనే బెట్టింగ్ మాఫియా ఇది సిక్సా? ఔటా అనే బెట్టింగ్స్ నడుపుతుంటుంది. బాల్ టూ బాల్, ఓవర్ టూ ఓవర్ బెట్టింగ్స్ నడిపి లక్షల కోట్ల రూపాయలు తమ ఖాతాల్లో వేసుకుంటున్నారు. ఇప్పుడు ఐపీఎల్‌లో ఫిక్సింగ్ జరుగుతుందా? లేదా అనేది తెలియకపోయినా.. అనధికార బెట్టింగ్ మాత్రం ఇప్పటికే అలర్ట్ అయ్యింది. ఈ రెండు నెలల సీజన్‌లో ఈ బెట్టింగ్ మాఫియా లక్షల కోట్లు వెనకేసుకోబోతోంది. కాబట్టి ఫాంటసీ లీగ్ యాప్స్‌కైనా, ఇలాంటి బెట్టింగ్ వ్యవహారాలకైనా దూరంగా ఉండటం మంచిది. ఇప్పటికే తెలంగాణ పోలీసులు బెట్టింగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న సందర్భంలో అందరూ అప్రమత్తంగా ఉండడం మంచిదని పోలీసులు తెలియజేస్తున్నారు.

# బెట్టింగ్ చిక్కుల్లో బాలకృష్ణ!

(మొదటి పేజీ తరువాయి)

సీరియస్‌గా తీసుకోగా మరో వైపు టాలీవుడ్ ప్రముఖులు ఒక్కొక్కరుగా బెట్టింగ్ చిక్కుల్లో దొరికిపోతుండటం హాట్ టాపిక్‌గా మారింది.

**బాలయ్య షో చూసి రూ.80 లక్షలు లాస్**

ఆహా అనే ఓటీటీ యాప్ లో బాలయ్య బాబు హోస్ట్ గా చేస్తున్న అన్ స్టాపబుల్ షో లో వచ్చిన ఓ బెట్టింగ్ యాప్ ను చూసి దాన్ని డౌన్ లోడ్ చేసుకుని రూ.88 లక్షలు పోగొట్టుకున్నానని నెల్లూరుకు చెందిన రాంబాబు అనే బాధితుడు తాజాగా మీడియా ముందుకు వచ్చాడు. దీంతో ఈ షోలో బెట్టింగ్ యాప్ ప్రమోషన్ నిజమే అని నిరూపించేందుకు ప్రభాస్ గెస్ట్ గా వచ్చిన ఎపిసోడ్ లో బెట్టింగ్ యాప్ ను ప్రమోషన్ చేశారని,° ప్రభాస్, గోపీచంద్ కు బాలయ్య ఇచ్చిన ప్రజెంటేషన్ పై ఫన్ 88 బెట్టింగ్ యాప్ పేరు ఉందని నెటిజన్లు అందుకు సంబంధించిన ఫొటోలను వైరల్ చేస్తున్నారు.

**అల్లు ఫ్యామిలీకి మళ్లీ షాక్ తప్పదా?:**

బెట్టింగ్ వ్యవహారంలో అన్ స్టాపబుల్ ప్రోగ్రామ్ పేరు తెరపైకి రావడంతో మరోసారి అల్లు ఫ్యామిలీ పేరు తెరపైకి వస్తోంది. అన్ స్టాపబుల్ ప్రోగ్రామ్ ను ప్రసారం చేస్తున్న ఆహా ఓటీటీ యాప్ టాలీవుడ్ నిర్మాత అల్లు అరవింద్ కు చెందిన గీతా ఆర్ట్స్, మై హోమ్ జాయింట్ వెంచర్ యాజమాన్యంలో ఉంది. ఈ యాప్ అల్లు అర్జున్ కూతురు అర్హా పేరుతో అర్హా మీడియా అండ్ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ తో నమోద్కై ఉండటం గమనార్హం. భవిష్యత్ లో విచారణలో భాగంగా తాను కేవలం ఆ కార్యక్రమానికి హోస్టును మాత్రమేనని బాలయ్య పోలీసులకు వివరణ ఇస్తే ఏం జరగబోతుంది? అటు ఇటు తిరిగి ఈ వ్యవహారంలో అల్లు అరవింద్ కు చిక్కులు తప్పవా అనే టాక్ వినిపిస్తోంది. పుష్ప-2 మూవీ బెనిఫిట్ షో సందర్భంగా గతేడాది సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మూవీ హీరో అల్లు అర్జున్ ( అరెస్టు అయి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ వ్యవహారం అల్లు ఫ్యామిలీకి భారీ షాక్ కు గా మారింది. తాజాగా టాలీవుడ్ ను కుదిపేస్తున్న బెట్టింగ్ వ్యవహారంలో చివరాఖరికు మరోసారి అల్లు ఫ్యామిలీకి షాక్ తగులుతుందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది.

**లీగల్ ఫైట్ లో పై చేయి ఎవరిదో?**

తాజా పరిణామాలతో బెట్టింగ్ యాప్ ల ప్రమోషన్ లో లీగల్ అంశం తెరపైకి వస్తోంది. రమ్మీ యాప్ ను ప్రమోట్ చేశారని విజయ్ దేవరకొండపై పోలీసులు నమోదు చేసిన కేసుతో ఆయన టీమ్ స్పందిస్తూ రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని గతంలో పలుమార్లు సుప్రీంకోర్టు తెలిపిందని, అన్ని అనుమతులు ఉన్న ఏ23 అనే సంస్థకు విజయ్ బ్రాండ్ కు విజయ్ అంబాసిడర్ గా పని చేశారు. ఆ కంపెనీతో ఒప్పందం గతేడాదే ముగిసింది. ఇప్పుడు ఆ సంస్థతో విజయ్ కు ఎలాంటి ఒప్పందం లేదని పేర్కొంది. రమ్మీ బెట్టింగ్ యాప్ ను ప్రమోట్ చేశారన్న కారణంతో కేసు నమోద్కైన ప్రకాశ్ రాజ్ సైతం స్పందిస్తూ.. 2016లో ఓ గేమింగ్ యాప్ కు పబ్లిసిటీ చేశానని అయితే అది ఇల్లీగల్ అని కొన్ని నెలల తర్వాత తెలిసి ఆ కాంట్రాక్ట్ నుంచి వైదొలిగానని ఓ వీడియో రిలీజ్ చేశారు. ఆ తర్వాత కూడా వారు తన పాత ప్రకటనోలతో ప్రచారం చేసుకోవడం గమనించి లీగల్ నోటీసులు కూడా పంపించానని చెప్పారు. అయితే ఈ కేసులో పోలీసులు న్యాయ సలహా తీసుకుని ముందుకు వెళున్నట్లు తెలిసింది. తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ పై 2017 నుంచి బ్యాన్ ఉందని, తెలంగాణ వ్యాప్తంగా బెట్టింగ్ యాప్స్ పై 800 వరకు కేసులు నమోదు అయినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికాగోయల్ ఓ మీడియా సంస్థకు వెల్లడిరచారు. మరో వైపు బెట్టింగ్ యాప్ కారణంగా మరణించిన వారి వివరాలపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీంతో అంతిమంగా లీగల్ ఫైట్ లో పోలీసులు పైచేయి సాధిస్తారా లేక యాప్స్ ప్రమోట్ చేసిన వారు కేసుల నుంచి తప్పించుకుంటారా అనేది చర్చనీయాంశంగా మారింది.

# అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):– ' భారత దేశం మరియు ఐరోపా లో ప్రజాస్వామ్యం, వైవిధ్యం, మార్పు 'అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును రాజనీతి మరియు ప్రభుత్వం పాలన శాస్త్రం మరియు ఇన్స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ ఎకౌంటబిలిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూరోపియన్ ఎరాస్మస్ ఆర్థిక సహకారంతో ఏప్రిల్ 4న జరిగే ఒక్కరోజు అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ను ఆంధ్ర విశ్వ కళాపరిషత్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. జీపీ రాజశేఖర్ ఛాంబర్లో ఆవిష్కరించారు. అంతర్జాతీయ సదస్సును నిర్వహించడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విశ్వ విద్యాలయం కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయని మరియు విద్యార్థులు, పరిశోధకులు జ్ఞానాన్ని సంపాదించవచ్చునని, ఇలాంటి సమావేశాలు తరచుగా జరగాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ పేటేటి ప్రేమానందంను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. ధనుంజయ రావు, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. ఏ.నరసింహారావు, సదస్సు కన్వీనర్, విభాగాధిపతి ప్రొ.ప్రేమానందం, డాక్టర్ సులేమాన్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు డా.ప్రసాదులు పాల్గొన్నారు.

# బేలెట్ బాక్స్లను పరిశీలించిన కలెక్టర్



ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):– చినగదిలి మండల ఆఫీస్ వద్దగల వివిఎం, బేలెట్ బాక్స్, గోడౌన్ లో గల, బేలెట్ బాక్సలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, హరేందిరప్రసాద్, తహసీల్దార్, పాల్ కిరణ్. ఈ కార్యక్రమంలోటీడీపీ నుండి 12వ వార్డు అధ్యక్షులు గాడి సత్యం, రాపర్తి గణపతి, బీజేపీ, నుండి మురళి మోహనరావు, కాంగ్రెస్ నుండి సుధాకర్, వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):– స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ నందు ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు కవితలు,పద్యాలు పోటీలు నిర్వహించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ వైకుంఠ రావు బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ మన మూలాలను మనం మరువరాదు. మన పూర్వీకులు అందజేసిన వెలకట్టలేని ఆస్తి కవితలు, పద్యాలు, జానపద గేయాలు ,వాటిని నేటి యువతీ యువకులకు అందజేసి వారికి మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల గౌరవమర్యాదలు కలిగేటట్లు చేయవలసిన బాధ్యత మన అందరిదీ, అని ఆయన మాటలలో వ్యక్తపరిచారు .,ప్రిన్సిపల్ ఆర్. వైకుంఠ రావు విద్యార్థులను ఉద్దేశించి కవిత్వాన్ని సమాజానికి మరింత చేరువ చేయాలని కవులు యొక్క గొప్పతనం తెలుసుకోవాలని మాట్లాడటం జరిగింది .దీనిలో ముఖ్యంగా ప్రిన్సిపల్ ఆర్ వైకుంఠ రావు , వైస్ ప్రిన్సిపల్ గణేష్ ప్రసాద్ రెడ్డి డీఎల్సిసి కోఆర్డినేటర్ షబీనా మరియు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.బీ టెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఈసీఈ విద్యార్థి ఏ ఈశ్వర్ కవిత అందరినీ ఆకట్టుకుందినింగి ఇస్తుంది నీటి ధనం...

నేల ఇస్తుంది పంట ధనం... గాలి ఇస్తుంది ప్రాణ ధనం...
ఏం ఇస్తున్నాం సాటి మనిషికి మనం..

మునిగిపోయాం స్వార్థం అనే ముసుగులో అందరం...
పంచుదాం చిరునవ్వుతో ఆనందం..

# 26న మండల సర్వ సభ్య సమావేశం



నాతవరం, (విశాఖ సమాచారమ్):– ఈ నెల 26 న బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నామని నాతవరం ఎంపీడీవో కె. ఉష్మశ్రీ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి అధ్యక్షతన వహిస్తారని ఆమె అన్నారు. కావున మండల ప్రజా ప్రతినిధులు సర్పంచులు ఎంపీటీసీలు మరియు మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలని అలాగే మండల పత్రిక విలేకరులందరూ కూడా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.


**ఈస్ట్‌కోస్ట్ రైల్వే**

లాట్ నెం./కేటగిరి: పార్కింగ్-వ్యాట్-బిఎస్‌కెపి ఎఫ్‌డబ్ల్యు-121-25-1 (ఫోర్ వీలర్ పార్కింగ్)

వివరణ : విశాఖపట్నం (వాల్తేరు డివిజన్) జనరల్ బుకింగ్ ఆఫీస్ ఎదురుగా ఫోర్ వీలర్స్ పార్కింగ్‌ను నిర్వహించుట.

రేట్ యూనిట్: తాంత్రిక లైసెన్స్ ఫీజు, ట్రిపుల్/రోజులు : 1096, కనీస పెరుగుదల (%): 0.2, లాట్ స్టేటస్: ప్రచురింపబడిన క్యాటలాగ్‌లో కొత్తది.

లాట్ ప్రారంభ తేది & సమయం: 26.03.2025 గం. 11.00లకు., లాట్ చివరి తేది మరియు సమయం : 26.03.2025 గం. 11.30లకు.,

పై టెండర్లకు సంబంధించిన ఈ టెండర్ల పత్రాలకు సంబంధించిన పూర్తి సమాచారం మా వెబ్‌సైట్ www.ireps.gov.in లో లభించును.

అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ వాల్తేర్

PR-1112/P/24-25

**ఈస్ట్‌కోస్ట్ రైల్వే**

లాట్ నెం./కేటగిరి: ఎంఎస్‌ఎస్-వ్యాట్-సీహెచ్‌ఈ-బీసీప-73 25-1 (ఎంఐఎస్‌సీ-గణాంక- సర్వీసుల బ్యాటరీ ప్రకటనలతో బండ్లను నడపాలి

వివరణ : బీఓసీ ఆపరేటర్స్/డ్రైవర్స్‌తో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ వద్ద ప్యాసింజర్లను బ్యాటరీతో నడిపే కార్లతో తీసుకెళ్లుట. సరఫరా మరియు నిర్వహణ

రేట్ యూనిట్: తాంత్రిక లైసెన్స్ ఫీజు, ట్రిపుల్/రోజులు : 1096, కనీస పెరుగుదల (%): 0.2, లాట్ స్టేటస్: ప్రచురింపబడిన క్యాటలాగ్‌లో కొత్తది.

లాట్ ప్రారంభ తేది & సమయం: 25.03.2025 గం. 11.00లకు., లాట్ చివరి తేది మరియు సమయం : 25.03.2025 గం. 11.30లకు.,

పై టెండర్లకు సంబంధించిన ఈ టెండర్ల పత్రాలకు సంబంధించిన పూర్తి సమాచారం మా వెబ్‌సైట్ www.ireps.gov.in లో లభించును.

అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ వాల్తేర్

PR-1117/P/24-25

**ఈస్ట్‌కోస్ట్ రైల్వే**

నోటీస్ నెం. ఈటీ-వ్యాట్-సౌత్-04-2025. తేది: 13.03.2025

పని పేరు : వాల్తేరు డివిజన్ విశాఖపట్నం కాంప్లెక్స్ ప్రాంతం నందు ఆటో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పరచుట. (1) సింహాచలం- బ్లాక్ హట్ క్యాబిన్ మధ్య కి.మి. 872/డీఎల్/2-3 వద్ద సిగ్నలింగ్ గూమిటీస్ నిర్మించుట. (2) కిమి. సింహాచలం- కాంకర్ క్యాబిన్ మధ్య 871/19ఎ- 20ఎ వద్ద. (3) వడ్లపూడి క్యాబిన్-దువ్వాడ మధ్య ఎన్‌టీపీసీ లెవెల్ క్రాసింగ్ నెం.1, కి.మి. టిపి/2/6-7 వద్ద (4) వడ్లపూడి క్యాబిన్-గేట్ జంక్షన్ మధ్య లెవెల్ క్రాసింగ్ ఎస్‌పి-6 లెవెల్ క్రాసింగ్ దగ్గర కి.మి. ఈఎన్/192-193 కి.మీ. వద్ద (5) ఈఎన్/90 దగ్గర 4వ నెంబరు వంతెన దగ్గర జిపిఎల్/2/1-2 కి.మి. వద్ద. (6) ఏ & ఎస్ లైన్ మీద 752వ వంతెన వద్ద కి.మి. 89 నుండి ఈఎన్/90 దగ్గర ఆటో సిగ్నలింగ్ గూమ్టీ నిర్వహించుట. (7) రాయగడ నుండి సింహాచలం మధ్య హెచ్‌డబ్ల్యుహెచ్ ఫ్లై ఓవర్ దగ్గర జిఆర్/29 నుంచి జిఆర్/30 కి.మి. వరకు ఆటో సిగ్నలింగ్ గూమ్టీ నిర్వహించుట. (8) వాల్తేరు/ఎంవైడి/ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కింద కి.మి. ఈఎన్/71 ఇంజన్ లైన్ మధ్య కాంకర్ నార్త్ గూమ్టీ వరకు. (II) రిలే రూమ్ గూమ్టేషన్ పెంచుట, నిర్మించుట. (1) RRI@A క్యాబిన్, (2) కాంకర్ నార్త్ గూమ్టీ (సింహాచలం క్యాబిన్-కాంకర్ క్యాబిన్ మధ్య), (3) రిలే రూమ్ గూమ్టీ (జగ్గయ్యపాలెం- కాంకర్ ఎండ్), (4) రిలే గది ముగింపు (జగయ్యపాలెం- వీపీడీ ఎండ్) (5) ఎన్‌టీపీసీ లైన్‌లో వడ్లపూడి క్యాబిన్-దువ్వాడ తూర్పు మధ్య 4/4 నుండి 4/6 కి.మి. వరకు ఆర్ఆర్ఐని పొడిగించుట. (6) గేటు జంక్షన్- వడ్లపూడి క్యాబిన్ మధ్య వ్యాగన్ వర్క్షా షాప్ నిర్వహించుట. (7) అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్/ ఎంవైడి/ వాల్తేరు కింద ఆర్ఆర్ఐ క్యాబిన్.

పని విలువ : ₹4,73,77,448.10, ధరావత్తు ₹3,86,900/-, పని పూర్తి చేయు కాలం : 12 (పన్నెండు) నెలలు.

మూసివేయు తేదీ మరియు సమయం: 08.04.2025, 1500 గం.

పోస్ట్/కొరియర్/- ఫ్యాక్స్ లేదా వ్యక్తిగతంగా పంపిన వాటిని అంగీకరించం. అటువంటి ఈ టెండర్లను గడువు సమయంలో సమర్పించినను స్వీకరించబడవు. అటువంటివి తిరస్కరించబడును. పై టెండర్లకు సంబంధించిన పూర్తి సమాచారం మా వెబ్‌సైట్ www.ireps.gov.in లో లభించును.

గమనిక : ఇచ్చిన టెండర్లు ఏవైనా మార్పులు గాని సవరణలు గాని ఉన్నట్లయితే టెండర్లు సమర్పించడానికి 10 రోజులు ముందు మా వెబ్‌సైట్‌ను సందర్శించండి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎస్&టీ) వాల్తేర్

PR-1114/P/24-25


# పచ్చదనంతో వాతావరణ కాలుష్యం నివారణ



రావికమతం, (విశాఖ సమాచారమ్):– పచ్చదనం పరిశుభ్రత తో పాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు అన్నారు. మండలంలో కవగుంట గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పలు రకాల మొక్కలను నాటడంతో పాటు వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్న నినాదంతో గత రెండేళ్ల క్రితం రావికమతం నుంచి కింతలికి వెళ్లే రహదారిలో కవగుంట నుంచి బుడ్డి బంద వరకు ఒక కిలో మీటర్ మేర ఆర్ అండ్ బి రోడ్డు ఇరువైపులా 500 మొక్కలను నాటడం జరిగిందన్నారు. వాటి మధ్యలో ఈ ఏడాది రోడ్డుకి ఒక ప్రక్కన 175 కొబ్బరి మొక్కలను అలాగే కొత్త చెరువు గట్టుపైన 75 కొబ్బరి మొక్కలు, గ్రామ కంఠం పరిధిలో మరొక 30 మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఇవి ఏపుగా పెరగడానికి ప్రత్యేకమైన శ్రద్ధ వహించి ఎండాకాలం దృష్ట్యా మొక్కలు చనిపోకుండా ఉండేందుకుగాను వాటిని పరిరక్షించుకునేందుకు మొక్కలకు ప్రతిరోజు నీటిని పోయించడం అలాగే గూడులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీటి వలన పచ్చదనం పరిశుభ్రత వాతావరణ కాలుష్యం అలాగే గ్రామపంచాయతీకి ఆదాయం వనరుగా ఉపయోగపడ తాయన్నారు. ప్రజలు తమకు ఇచ్చిన అవకాశాన్ని గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. అందుకనే ప్రతి ఇంటి వద్ద,కల్లాల వద్ద ఒక్కొక్క మొక్క చొప్పున ప్రజలందరూ నాటడం ఎంతో ఉపయోగకరమన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు మొక్కలను పాడు చేయకుండా ప్రతిరోజు వాటిపై పర్యవేక్షణ చేయడం వలన అవి ఒక సుందరవణంగా తయా రయ్యాయి అన్నారు. గ్రామంలో మొక్కలు పెంపకం, ప్రజలకు మంచినీటి సౌకర్యం, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పరిశుభ్రత, స్మశాన వాటికల అభివృద్ధి,డంపింగ్ యార్డ్ ల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వీధి రోడ్లు నిర్మాణం, మంచినీటి బోరులు ఏర్పాటు, నూరు శాతం ఇంటి పనులు వసూలు పై ప్రత్యేక దృష్టి, అంగనవాడి ,పాఠశాల విద్య పై ప్రత్యేక శ్రద్ధ వహించడం, ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక రకాల పథకాలను అర్హత కలిగిన ప్రజలం దరికీ అందించడమే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందన్నారు.

# మధుమేహం, అధిక రక్తపోటుల పై నిర్లక్ష్యం వద్దు

నాతవరం, (విశాఖ సమాచారమ్):– మండల కేంద్రమైనటువంటి నాతవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, శుక్రవారం, హ్రుదయ్ సంస్థ ఆధ్వర్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో కమ్యూనిటీ అడ్వైజర్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎస్.ప్రసన్న మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువమంది మధుమేహం మరియు అధిక రక్తపోటుతో కలసి బాధపడుతున్నారని అన్నారు. ఎక్కువమంది మల్టీ లాంగ్ టర్మ్ కండిషన్స్ తో బాధపడుతున్నారని అన్నారు. దీనికి కారణం నిర్లక్ష్యము ముఖ్య కారణం అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు అంతేకాక వీటి గురించి భయపడనవసరం లేదని మంచి మందులు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమమునకు ప్రత్యేక అతిథిగా విచ్చేసిన జి రాణి సర్పంచ్ మాట్లాడుతూ మంచి ఆహారం మంచి నడవడిక కలిగి ఉంటే జబ్బులకు దూరంగా ఉండవచ్చు అని అన్నారు అంతేకాక ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు చిన్నతనం నుండి మంచి అలవాట్లు నేర్పించాలని అన్నారు. మరియు ఈ కార్యక్రమానికి విచ్చేసిన అప్పల నరస జెడ్పిటిసి మాట్లాడుతూ గతంలో కన్నా ప్రస్తుతం మధుమేహం మరియు అధిక రక్త పోటుకు మంచి మందులు లభ్యమవుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటే అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చు అన్నారు. హృదయ సంస్థ రీసెర్చ్ అసిస్టెంట్ కాలంగి రవికుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మల్టీ లాంగ్ టర్మ్ కండిషన్స్ తో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించుటకు సంస్థ వినూత్న కార్యక్రమాలను చేపడుతుందని వివరించారు దానికి ముందుగా కమ్యూనిటీ అడ్వైజర్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ బోర్డులో గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన నేతలు ఉంటారని వారితో పాటు ఆరోగ్య రంగంలో పనిచేసే ముఖ్యమైన వారందరూ ఉంటారని చెప్పారు. ఈ బోర్డు రానున్న రోజుల్లో మల్టీ లాంగ్ టర్మ్ కండిషన్స్ తో బాధపడుతున్న వారికి బాసటగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ డాక్టర్ ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మల్టీ లాంగ్ టర్మ్ కండిషన్స్ తో బాధపడుతున్న వారికి సమస్త చేస్తున్న కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు అంతేకాక ప్రభుత్వ అందిస్తున్న ఆరోగ్య పథకములను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ తాండవ చైర్మన్ మరియు ఎంపీపీ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీటీసీ అప్పిరెడ్డి మాణిక్యం మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో జీవితాన్ని కొనసాగించాలని కోరారు.

# పర్వతాలలో ప్రయాణించడానికి ఎలక్ట్రిక్ వాహనాలను ఎంపిక చేయడానికి 5 కారణాలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):– పర్వత ప్రాంతాల్లో జీవించే వారి కోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు) ప్రసిద్ధి చెందిన ఎంపికగా మారుతున్నాయి. వాటి వినూత్నమైన ఫీచర్లు మరియు పర్యావరణాను కూలమైన డిజైన్ లు సవాలుతో కూడిన భూభాగాల్లో వాటిని సాఫీ, మరింత ఆనందకరమైన రైడ్ గా చేసాయి. పర్వత ప్రాంతాల్లో జీవిస్తూ మరియు ప్రయాణించేటప్పుడు ఈవీని డ్రైవ్ చేయడానికి ఇక్కడ 5 గొప్ప కారణాలు ఇవ్వబడ్డాయి.

ఈవీలకు పునరుత్పాదక బ్రేకింగ్ వ్యవస్థ ఉంటుంది. ఇది బ్రేకింగ్ సమయంలో కైనెటిక్ ఎనర్జీని గ్రహిస్తుంది మరియు బ్యాటరీని రీఛార్జ్ చేయడానికి ఎలక్ట్రికల్ ఎనర్జీలోకి మారుస్తుంది. ఈ ఫీచర్ మీరు తరచుగా విరామాలు తీసుకుని మరియు ఎంతో శక్తిని తిరిగి పొంది, మొత్తం సామర్థ్యాన్ని మెరుగుపరచుకునే పర్వత ప్రాంతాల్లో ప్రత్యేకించి ఉపయోగకరమైనది.

ఈవీలకు తక్షణ టార్క్ ఉంటుంది, ఎత్తైన పర్వతాలు ఎక్కే సమయంలో ఎంతో ప్రయోజనకరమైనది. అనగా ఈవీలు త్వరగా వేగం పుంజుకుంటాయి, ఏటవాలుగా ఉండే ప్రాంతాల్లో కూడా సంప్రదాయబద్ధమైన ఇంటర్నల్ కంబస్టన్ ఇంజన్ వాహనాలను కూడా తరచుగా అధిగమిస్తాయి. ఇది కొండ పైకి చేసే డ్రైవింగ్ ను సులభం చేస్తుంది, డ్రైవర్లకు ఆత్మవిశ్వాసం కలిగిస్తుంది మరియు సందిగ్ధంగా ఉండే పరిస్థితులను నియంత్రిస్తుంది. ఈవీ డిజైన్ వాహనంలో బ్యాటరీ ప్యాక్స్ ను తక్కువగా ఉంచుతుంది, ఇది గురుత్వాకర్షణ శక్తిని తగ్గిస్తుంది. ఇది ప్రత్యేకించి గాలి వీస్తున్న పర్వత రహదారుల్లో లేదా తీవ్రమైన మలుపులలో కారుకు మెరుగైన స్థిరత్వాన్ని ఇస్తుంది. ఇది మీరు నియంత్రణలో ఉండటానికి మరియు రోడ్డు ఎంత మలుపులతో ఉన్నప్పటికీ సాఫీ, సురక్షితమైన రైడ్ ను ఆనందించడానికి సహాయపడుతుంది.

ఈవీలు ICE వాహనాలు కంటే సహజంగా మరింత సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అవి బ్యాటరీ నుండి అత్యధిక శాతం శక్తిని కదలికగా మారుస్తాయి.

# విశ్వవిద్యాలయాల ప్రగతిలో విద్యార్థుల పాత్ర ప్రశంసనీయం

## ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహ రావు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):– దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల ప్రగతిలో విద్యార్థుల పాత్ర అత్యంత ప్రశంసనీయమని ఆంధ్ర యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ నరసింహారావు కొనియాడారు. ఏయూ తెలుగు విభాగంలో తాజాగా సెమినార్ హాల్ ను ఆధునీకరించారు. దీంతో శుక్రవారం ఆ సెమినార్ హాల్ ను ప్రిన్సిపల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ. తాము 30 ఏళ్ళ కిందట విధుల్లో చేరినప్పుడు ఆర్ట్స్ కలశాలలు లో అంతంత మాత్రమే సదుపాయాలు ఉండేవన్నారు. ఒక దశలో ఆర్ట్స్ కళాశాలలు అంటే అప్పట్లో చిన్న చూపుగా ఉండేవన్నారు. అయితే క్రమేపి ఆ భావన పోయి నేడు

నాక్ ర్యాంక్ లలో సైతం ఆర్ట్స్ కళాశాలలు కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు అలాగే పరిశోధకులు, ఆచార్యులు అందిస్తున్న సహాయ సహకారాలు ప్రసంసనీయం అన్నారు. అలాగే తరగతి గదులను శుభ్రం చేయడంతో పాటు తమ ఇళ్ళలో మాదిరిగానే అందమైన రంగులు వేసి ఎంతో బాగా ఆధునీకరించడంలో విద్యార్థుల కష్టం మరువ లేనిదన్నారు.. తన పరిధి మేరకు ఆర్ట్స్ కళాశాల అన్ని విభాగాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యతోనే అపారమైన ఉపాధి అవకాశాలు కలుగుతాయని, కాబట్టి విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో ఉన్నత విద్యాభ్యాసం సాగించి మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు నేడు అనేక రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ అందరి సహకారంతోనే ఈ విభాగాన్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు. ఇందుకు సహకరించిన వర్సిటీ పెద్దలతో పాటు పరిశోధకులు, పూర్వ విద్యార్థులు అందించిన సహకారం మరువలేనిదన్నారు... ఇతర విభాగాలకి తెలుగు విభాగం ఆదర్శప్రాయం కావాలన్నదే తన లక్ష్యం అన్నారు... తెలుగు విభాగం విద్యార్థులు నేడు ఎంతో ప్రతిభ పాటవాలు ప్రదర్శించి ఉన్నత స్థాయీ అవకాసాలు అంది పుచ్చు కుంటున్నాయన్నారు..ఈ సందర్భంగా విద్యార్థులు తరపున ప్రిన్సిపాల్ తో పాటు శాఖ అధ్యక్షులు జెర్రా అప్పారావు ను ద్వితీయ సంవత్సరం విద్యార్థి గంట్ల శ్రీను బాబు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో తెలుగు విభాగం ఆచార్యులు గజ్జ యోహాను బాబు, వెంకటేశ్వర్లు యోగి, ఎ. ఈశ్వరమ్మ, కట్టెపోగు రత్న శేఖర్, పెండ్యాల లావణ్య, పరిశోదక విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు..

# నేషనల్ ఉషు టోర్నమెంట్ కు వేపాడ ప్రియాంక



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):– ఈనెల 22 నుండి 25 వరకూ బిలాస్పూర్, ఛత్తీస్ ఘడ్ లో జరుగనున్న నేషనల్ ఉషు పోటీలకు మన నర్సీపట్నం నుండి వేపాడ ప్రియాంక సీనియర్ ఉమెన్ కేటగిరి 70 కేజీ ల విభాగం లో ఆంధ్ర ప్రదేశ్ నుండి పాల్గొంటుంది అని సీనియర్ కోచ్ శేఖర్ తెలిపారు.అకాడమీ డైరెక్టర్స్ వెలగా నారాయణ రావు, సుతాపల్లి శ్రావణ్, శ్రీకాంత్ మరియు ఎన్ ఆర్ ఐ డైరెక్టర్స్ అల్లాడి సురేష్,శాప్ కోచ్ అబ్బు, మెంబెర్లు కోచ్ లు అందరూ అభినందించారు. ఒక వైపు స్టూడెంట్స్ కి ఉషు బాక్సింగ్, కరాటే లలో శిక్షణ ఇస్తూ ఇలా స్టేట్ నేషనల్ లెవెల్లో స్టూడెంట్స్ తో పాటు ప్రియాంక కూడా పాల్గొంటున్నారు.

# హోం మంత్రి కృషితో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు

నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):– నియోజకవర్గంలో పాఠశాలలని అభివృద్ధి చేయడమే హోం మంత్రి వంగలపూడి అనితమ్మ లక్ష్యమని నక్కపల్లి మండల టిడిపి అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు.అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండల టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం చీడిగ గ్రామంలో రెసిడెన్షియల్ స్కూల్ మరియు హాస్టల్ నిర్మాణపు పనులు కోసం 2 కోట్ల 30 లక్షల రూపాయలు నిధులు హోం మంత్రి అనిత మంజూరు చేసినట్లు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు.అలాగే గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చీడిగ గ్రామానికి రోడ్డు వేసిన ఘనత హోం మంత్రి అనితమ్మదేనని ఆయన అన్నారు.నియోజకవర్గంలో ఎప్పుడు అభివృద్ధికి నోచుకోని పాఠశాలలను ఆధునీకరించడానికి నిధులు మంజూరు చేశారన్నారు.నియోజకవర్గంలో ఉన్న పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణపు పనులు అనితమ్మ చేపడుతున్నారని,ముందస్తు చర్యలు చేపట్టి తాగునీటి ఎద్దడి లేకుండా చేసారన్నారు. నియోజకవర్గ ప్రజలు తరపున హోం మంత్రి అనితమ్మకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గింజల లక్ష్మణరావు దార్ల కృష్ణ,చీడిపల్లి దొరబాబు,కర్రి అప్పారావు, దొర మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అంతరించిపోతున్న పిచ్చుకలను కాపాడుకుందాం

## అనకాపల్లి గ్రీన్ క్లబ్ పిలుపు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):– ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లబ్ అనకాపల్లి వారు మన ఇంటి పిచ్చుకలను మనమే రక్షించుకుందాం అనే కరపత్రాన్ని అనకాపల్లి పార్లమెంటు కార్యాలయం ఇంచార్జ్ విజయ నాయుడు చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ నాయుడు మాట్లాడుతూ అంతరించిపోతున్న పిచ్చుకలను కాపాడేందుకు ప్రజల్లో అవగాహన పెంచి చైతన్యం తేవడానికి కృషి చేస్తున్న గ్రీన్ క్లబ్ కృషి అభినందనీయమని కొనియాడారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ పర్యావరణ పరిరక్షణ కోసం పక్షుల దాహార్తి తీర్చేందుకు చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. హరితాంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. దీంట్లో చేపట్టబోతున్న కార్యక్రమాలు ద్వారా ప్రజల్లో వస్తున్న చైతన్యం ఒక ఇంట్లో ఒక గూడు కార్యక్రమాలు గురించి గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు శ్రీధర్ వివరించారు. కార్యక్రమంలో శ్రీధర్ ను, శ్రీ భోగ లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ను విజయ నాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా పిచ్చుక గూళ్ళు ఏర్పాటు ధాన్యపు కుంచలు, మట్టి పాత్రలలో తాగునీరు దేవాలయాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు పెంటకోట ఉమామహేశ్వరరావు, బేతాళం శేషసాయి, రావూరి అనిత తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):– మార్చి 24 , 25 తేదీలలో బ్యాంకు ఉద్యోగులు సమ్మెను వాయిదా వేశారు మేనేజ్మెంట్ దగ్గర నుండి సానుకూలమైన స్పందన వచ్చిందని అందువల్ల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారాని యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కాండ్రేగుల హరికృష్ణ తెలిపారు.

వారానికి ఐదు రోజులు పని దినాలు (కారుణ్య నియామకాలు) చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం బ్యాంకులో ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల బ్యాంకు ఉద్యోగాలు ఇవ్వాలని టెంపరరీగా పనిచేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామనిసెక్యూరిటీ గార్డు లో ఖాళీలను పూర్తి చేయాలని డిమాండ్ చేశామన్నారు అందుకు. ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించింది అని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు కాండ్రేగు హరికృష్ణ, ఆడారి చంద్రశేఖర్, శరగడం శ్రీనివాస్, ఆడారి అప్పారావు ,తోట శ్రీనివాసు, రామలక్ష్మి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
శనివారం 22-3-2025

# నీటి సంక్షోభం!

జీవులకు ప్రాణాధారం జలం. భూగృహంపై జీవకోటి ఉనికికి కారణం ద్రవరూపంలో ఉన్న నీరు మాత్రమే. అతి ముఖ్య సార్వత్రిక ద్రావణిగా జలధారలు భూఉపరితలంపై నిరంతరం ప్రవహిస్తూనే ఉన్నాయి. భూమిపై ఉన్న జల సంపదలో అత్యధిక మొత్తం సముద్ర జలం లేదా హిమానీనదాల (గ్లేసియర్స్) రూపంలో ఉండడంతో పాటు కేవలం 3 శాతం మాత్రమే మంచి నీటి జలంగా మానవాళికి అందుబాటులో ఉంటోంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్రమైన నీటి కొరత లేదా నీటి ఒత్తిడిని అనుభవిస్తోంది. నేడు మార్కెట్‌లో నీటిని పాల వలె అధిక ధరలకు కొనుక్కోవలసిన అగత్యం ఏర్పడిరది. రానున్న కొన్ని దశాబ్దాల్లో నీటి కొరత ఎక్కువై దేశాలు, ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు 2.2 బిలియన్ల ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. రాను రాను నీటి కొరత పెరిగి గొంతులు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. మంచి నీటి వనరుల్లో నదులు, చెరువులు, సరస్సులు, వాగులు వంకలు, భూగర్భ జలాలు లాంటి నీటి నిల్వలు వస్తాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-6 ప్రకారం '2030 నాటికి అందరికీ నీరు - పారిశుద్ధ్యం' అనే లక్ష్యం సుసాధ్యం అయ్యేట్లుగా కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ - పరిశ్రమలకు నీటి అవసరాలు పెరగడంతో రానున్న రోజుల్లో నీటి సంక్షోభం తప్పేలా లేదు.

తాగు నీరు, సాగు నీరు, పరిశ్రమలు, జల విద్యుత్ కేంద్రాలు, ఉత్పత్తి రంగాలు జల వనరులను అత్యధికంగా వినియోగించుకుంటున్నాయి. ప్రాణికోటి మనుగడకు కారణమైన నీటి కొరతను అధిగమించడానికి ప్రజలకు నీటి ఆవశ్యకత పట్ల అవగాహన పెంచాల్సిన అవసరాన్ని గమనించిన ఐరాస ఏటా మార్చి 22న "ప్రపంచ నీటి దినోత్సవం లేదా వరల్డ్ వాటర్ డే"ను 1993 నుంచి పాటించడం ఆనవాయితీగా మారింది. నేటి పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాల పెరగడం, హరిత గృహ వాయువులు అధికం కావడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో హిమానీనదాలు వేగంగా కరుగుతూ తరుగుతూ రానున్న ప్రమాద హెచ్చరికగా మారనున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరగడం జరిగి మానవాళికా మరో ప్రమాద ఘంటికలు మోగించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. హిమానీనదాల పరిరక్షణకు నేటి మానవాళి తన దృష్టిని పెట్టవలసి ఉందనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని 2025 ప్రపంచ నీటి దినం ఇతివృత్తంగా 'హిమానీనదాల పరిరక్షణ' ( గ్లేసియర్స్ ప్రిజర్వేషన్) పై అవగాహన గలిగిస్తున్నారు.

హిమానీనదాల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా చేసుకొని 2025 ఏడాదిని 'అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం'గా కూడా ప్రకటించి తగు ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. క్రియోస్ఫియర్, వాతావరణ మార్పులు, నీటి చక్రం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణం, పౌర సమాజాల మధ్య నెలకొని ఉన్న సంబంధాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నీరు ద్రవ రూపంలో కాకుండా ఘన మంచు రూపంలో అధికంగా ఉన్నపుడు దాని ప్రతికూల ప్రభావం భూమిపై పడుతుంది. దీంతో పాటు 2025-34 దశాబ్దాన్ని కూడా "క్రియోస్ఫియరిక్ సైన్సెస్ చర్యల దశాబ్దం"గా ప్రకటించారు. ఇదే క్రమంలో నీరు - పారిశుద్ధ్యాలకు సంబంధించిన నివేదికను 'వాటర్ టవర్స్ : మౌంటేన్స్ అండ్ గ్లేసియర్స్' పేరుతో విడుదల చేశారు.

భూతాపం పెరిగిన కొద్ది హిమానీనదాలు క్రమంగా, వేగంగా కరుగుతూ తరిగిపోతున్నాయి. అధిక మొత్తంలో హిమానీ నదాలు కరిగితే వరదలు, కొండచరియలు విరిగి పడడం, సముద్ర మట్టాలు పెరగడం, కరువు కాటకాలు రావడం, జీవ వ్యవస్థల్లో లోపాలు జరగడం లాంటి ప్రతికూలాలు అనుభవంలోకి వస్తాయి. 2023లో గ్లేసియర్స్ కరగడం వల్ల 600 గిగాటన్నుల నీరు వ్యర్థంగా ప్రవహిస్తున్నది. భూగోళంపై ఉన్న మంచి నీటిలో 70 శాతం వరకు మంచు రూపంలోనే ఉంటున్నది. గ్లేసియర్స్ కరగడంతో 1900 నుంచి నేటి వరకు దాదాపు 20 సెమీ సముద్ర మట్టం పెరగడం గమనించారు. భూతాపాన్ని తగ్గిస్తేనే గ్లేసియర్స్ కరిగే వేగం అదుపులో ఉంటుంది. నీటిని ఆదా చేస్తూ, హిమానీనదాలను రక్షించుకుంటూ రాబోయే తరాలకు సుజల వాతావరణం కల్పిద్దాం, నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకుందాం.

పంచాంగం

శనివారం 22-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. అష్టమి తె. 5.24 |
| నక్షత్రం | : మూల రా. 3.24 |
| వర్జ్యం | : ప. 10.19 ల 12.01 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే అసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# భర్త రాసిన ఆఖరి ఉత్తరం

## (వృద్ధాప్యం దరి చేరిన వారు తప్పక చదవాల్సిన ఓ యధార్థ కథ)



పది రోజుల నుండి బంధువులు, పిల్లల తోటి, కర్మకాండలతో హడావిడిగా ఉన్న ఇల్లు ఒక్కసారి అందరూ వెళ్లిపోవడంతో నిశ్శబ్దం అయిపోయింది.

ముప్పై ఐదు సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఎందరికో విద్యాబోధన చేసి, పిల్లలందరికీ పెళ్లిళ్లు చేసి,

రెండు సంవత్సరాల క్రితమే పదవీ విరమణ చేసి, హాయిగా కాలక్షేపం చేస్తున్న వెంకటేశ్వర్లు సార్ సడన్ గా కాలం చేయడంతో భార్య పార్వతమ్మ ఒంటరిది అయిపోయింది.

పిల్లలందరూ వెంకటేశ్వర్లు సార్ రాసిన వీలునామా చదువుకుని హాయిగా ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.

ఇక మిగిలింది భార్య పార్వతమ్మ%ా.

ఆ ఇంటిలో ఒంటరిగా అయిపోయింది.

పిలిస్తే పలికే నాథుడే లేడు.

ఈ శేష జీవితం ఎలా గడపాలా అని ఆలోచనలతో భార్య పార్వతమ్మ శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది.

కడుపున పుట్టిన పిల్లలు వీలునామా ఎలా అమలు జరపాలో ఆలోచించుకుంటున్నారు గానీ, భర్త పోయి పుట్టెడు దుఃఖంలో ఒంటరిగా ఉన్న అమ్మ గురించిన ఆలోచన ఏ ఒక్కరికి లేదు.

వెళ్లి వస్తాం...

"ఆరోగ్యం జాగ్రత్త,"

"సమయానికి మందులు వేసుకో",

"ఏదైనా అవసరమైతే ఫోన్ చెయ్" .....

అంటూ పిల్లలు మాట వరసకు జాగ్రత్తలు చెప్పి ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు.

మొట్ట మొదటిసారి విపరీతమైన భయంతో పాటు దిగులు వేసింది. కళ్ళనుండి అప్రయత్నంగా కన్నీళ్లు జారాయి.

ఇంతలో..... పోస్ట్ అని కేక వినబడింది.

ఎవరు రాసుంటారబ్బా ఈ ఉత్తరం అనుకుంటూ అప్రయత్నంగా ఫ్రమ్ అడ్రస్ చూసి ఆశ్చర్యపడింది.

దానిమీద ఫ్రమ్ అడ్రస్ తన భర్త వెంకటేశ్వర్లు గారిదే.

చనిపోయిన వ్యక్తి ఎలా ఉత్తరం రాశారనుకొంటూ కవర్ ఓపెన్ చేసి ఉత్తరం చదవసాగింది.

" ప్రియమైన పార్వతికి...

నువ్వు ఆశ్చర్య పడతావని నాకు తెలుసు.

నేను బతికున్న రోజుల్లో రాసిపెట్టిన ఈ ఉత్తరాన్ని ఢిల్లీలో తెలంగాణ భవన్ లో పనిచేస్తున్న మన బిడ్డలాంటి నా ప్రియ శిష్యుడు సుబ్రహ్మణ్యం కిచ్చి....

నేను చనిపోయిన తర్వాత పోస్ట్ చేయమని చెప్పాను.

నా మనసులోని మాట నేను బతికినన్నాళ్ళు చెప్పలేకపోయా.

మరణం ఎవరికి ముందు వస్తుందో ఎవరికి తెలుస్తుంది ?

భర్త పోయిన భార్య ఈ లోకంలో బతకడం చాలా కష్టం.

ముందుగా పిల్లలందరూ దూరంలో ఉంటారు.

ఒంటరిగా బ్రతకాలంటే నీకు చాలా మానసిక ధైర్యం కావాలి.

ఒకవేళ పిల్లల దగ్గరకు వెళ్లినా ఈ ఆధునిక కాలంలో కొడుకు, కోడలు ఉద్యోగాల్లో ఉండటం వల్ల, వాళ్ల కుటుంబ వ్యవహారాల బాధ్యతలు నీ నెత్తి మీద రుద్దబడుతాయి.

వయసు మీరిన నీకు వంట వార్పు చేయడం చాలా కష్టం.

తప్పని పరిస్థితుల్లో తెలియకుండానే కుటుంబ బరువులు మరింత పెరుగుతాయి.

ఒంటరిగా ఉంటే.... ఆర్థిక భరోసా ఎంత ఉన్నా బ్యాంకుకు వెళ్లి డబ్బు తీసుకోవడం కూడా చాలా కష్టం అవుతుంది.

డబ్బు చాలా చెడ్డది.

మంచి వారిని కూడా మాయల మరాఠీలు గా చేస్తుంది.

ఇక విషయంలోకి వస్తే పిల్లలందరి పేరున రాసిన వీలునామా చెల్లదు.

ఎందుకంటే నా ఆఖరి వీలునామా నీ పేరు మీద ఉంది. ఏదో వాళ్ళని సంతృప్తి పరచడానికి అలా రాశాను కానీ నాకు వాళ్ల మీద నమ్మకం లేదు.

కాలం అలా ఉంది మరి.

ఎంతోమంది స్నేహితుల జీవితాలు చూసాను.

చనిపోయి రోజులు కూడా గడవక ముందే బ్యాంకుల చుట్టూ తిరిగే స్నేహితుల భార్యలను చూసి మనసంతా కకావికలమైపోయేది.

నా ఆఖరి వీలునామా ప్రకారం ఆస్తంతా నీ పేరు మీద ఉంది.

వీలునామా కాగితం లాకర్లో నీ నగల పెట్టెకింద పెట్టాను.

ఇంకొక కాపీ సీల్డ్ కవర్లో ఉంచి బ్యాంకు లాకర్ లో ఉంచాను. ఏదైనా అవసరమైతే నా ప్రియ శిష్యుడు తెలంగాణభవన్ సుబ్రహ్మణ్యం కు ఫోన్ చెయ్. వాడికి చాలా వివరాలు చెప్పాను.

ఆర్థిక స్వాతంత్ర్యం గనక స్త్రీకి ఉంటే ప్రపంచమంతా ఆమెను లోకువగా చూడదు.

పిల్లలు మంచి మంచి ఉద్యోగాల్లో ఉన్నా... ఏదైనా పరిస్థితులు బాగా లేనప్పుడు నువ్వు ఎవ్వరిని అడగక్కర్లేదు.

బ్యాంకు బాలన్స్ అంతా జాయింట్ అకౌంట్ లోనే ఉంది . ఒక్కసారి నువ్వు బ్యాంకుకు వెళితే పనిచేసే పెట్టే నా శిష్యుడు నరేష్ బ్యాంకు మేనేజర్ గా మన ఊరికి బదిలీ అయి వచ్చాడు.

వాడు సహాయం చేస్తాడు.

ఏ పిల్లల ఇంటికెళ్ళినా నీకు స్వతంత్రం ఉండదని నాకు తెలుసు. సున్నితమైన నీ మనసు బాధపడుతుంది.

నేను కట్టిన ఇంట్లో, నేను సంపాదించిన సొమ్ముతో నీ శేష జీవితాన్ని చక్కగా గడుపు. మానవపరిణామక్రమంలో వచ్చిన జీవితానికి నా చివరి శ్వాస వరకు తోడుగా నిలిచిన నీకు చాలా రుణపడి ఉన్నాను.

వీలునామా మార్చానని పిల్లలకు కోపం రావచ్చు.

ఇన్నాళ్ళూ నీతోటి చాకిరీ చేయించుకుని నిన్ను దిక్కులేని దానిగా, జీతం లేని పనిమనిషి లాగా చేసే అవకాశం ఉంటుందని నేను ఇలా చేస్తున్నాను.

మన పిల్లలను కంటికి రెప్పలా పెంచాము. మంచి మంచి చదువులు చెప్పించాం. ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

పెళ్లిళ్ల తర్వాత వాళ్లకున్న బాధ్యతల వల్లో, మరే కారణమో తెలియదు కానీ వాళ్ల ప్రాధాన్య అంశాల్లో మనం లేము.

నేనది గుర్తించాను.

మన కొడుకు మనల్ని బాగా చూసుకోవాలని అనుకున్నా కోడలి ఒత్తిడి వల్ల వాడు మనల్ని వాళ్ళతో ఉండమని మాట మాత్రం కూడా అడగలేకపోతున్నాడు.

కూతురి పరిస్థితి సరే సరి.

వాళ్ళ పిల్లల పెంపకానికి, అవసరమైనప్పుడల్లా వాళ్ళ పని మనిషిగా నిన్ను ఉపయోగించుకొని ,

ఈ అవసాన దశలో నీ వైపు కన్నెత్తి చూడటం లేదు.

ఇవన్నీ నేను గమనించాను.

ఎంతోమంది తల్లిదండ్రులు అనాధ శరణాలయాల్లో దిక్కుమొక్కు లేకుండా జీవనం గడుపుతున్నారు.

తమ సొంత కొడుకులు, కూతుర్ల ఇళ్లల్లో జీతం లేని వంట మనుషుల్లాగా బతుకు వెళ్ళదీస్తున్నారు.

కాలం పెట్టే పరీక్షకి మనం ఎదురొడ్డి నిలవాలి.

కానీ అధైర్య పడకూడదు.

ఒకరు ముందు ఒకరు వెనకం. అంతే !

ఓపిక ఉన్నన్నాళ్ళు ధైర్యంగా, ఇష్టమైన పనులు చేస్తూ బతుకు.

ఇన్నాళ్లూ ఎన్నో బాధ్యతలు మోసిన నేను ఒక్కసారిగా నిన్ను వదిలి వెళ్ళిపోతే...

మీద పడే బాధ్యతలు నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తాయని తెలుసు.

దీనికి భయపడకు.

అన్నీ సర్దుకుంటాయి.

కాలమే అన్నింటికీ పరిష్కారం చూపుతుంది.

భాగస్వామికి ఏ లోటు లేకుండా చేయడమే మనలాంటి పెద్దలు చేయవలసిన పని.

జీవితం ఎప్పుడూ సవాళ్లను విసురుతూనే ఉంటుంది. కష్టమైనా, సుఖమైనా నింపాదిగా ఎదుర్కో

బాధ్యతలన్నీ ఒంటిచేతి మీద నెట్టుకుంటూ వచ్చి బిడ్డలని ప్రయోజకులను చేసిన నువ్వు, ఇప్పుడు వచ్చిన ఈ కష్టాన్ని అధిగమిస్తూ, ఆనందంగా కాలం గడపడమే నీ చేతుల్లో ఉన్న విషయం.

నేను బతికున్న రోజుల్లో ప్రతి సమస్యకి నీతో చర్చించి సలహా తీసుకునే వాడిని.

ఇప్పుడు నువ్వు సలహా అడగడానికి నేను లేను.

కాబట్టి ముఖ్యమైన విషయాలన్నీ చెప్పేశాను.

సమయానుకూలంగా నిర్ణయం తీసుకోవడమే నీ బాధ్యత.

ఇక నీ కాలక్షేపానికి చుట్టుపక్కల పిల్లలందరినీ పిలిచి ఉచితంగా చదువు చెప్పు.

అవసరమైతే పేద పిల్లలకి స్కూల్ ఫీజులు కట్టు.

నీకు మానసిక సంతృప్తి కలిగే

ఏ పనైనా సరే స్వచ్ఛందంగా చేయగలిగిన ఆర్థిక స్వాతంత్రం నీకు కలిగించాను.

ఇట్లు

ప్రేమతో

నీ భర్త ...

ఎప్పుడో విధి కలిపిన బంధం , చనిపోయిన తర్వాత కూడా తన వంతు బాధ్యతని ఉత్తరం ద్వారా చెప్పిన భర్తకి మనసులోధన్యవాదాలు చెప్పుకుంటూ....

కళ్ళల్లో నీళ్లు సుడులు తిరుగుతుంటే కొంగుతో తుడుచుకుంటూ....

ఎదురుగా గోడపై ఉన్న భర్త ఫోటోకు హృదయపూర్వకంగా నమస్కరిస్తోంది వెంకటేశ్వర్లు భార్య పార్వతమ్మ...

# కత్తి వీరుడు కాంతారావు

## నేడు వర్ధంతి



సుప్రసిద్ధ నటులు కాంతారావు 1923 నవంబరు 16 న కోదాడ దగ్గర గుడిబండ గ్రామం, సూర్యాపేట జిల్లా తెలంగాణ లో జన్మించారు. తన 15 వ ఏట నుంచి కొద్దికాలం వడెలు గిరి గ్రామ మునసబు గా పనిచేశారు. నటన పట్ల మక్కువతో చెన్నై వెళ్లారు. తెలుగు సినిమాలో అనేక సాంఘిక , జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు 'నిర్దోషి' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఎచ్. ఎం. రెడ్డి నిర్మించిన ప్రతిజ్ఞ జానపద చిత్రంలో కథానాయకునిగా తన సత్తా చు వెండి తెరపై అగ్ర స్థానానికి ఎదిగారు. జానపద చిత్రాలంటే పిల్లలకు, పెద్దలకు ఎంతో మక్కువ. ఇక జానపద చిత్రాలలో రా కుమారిని, దేశాన్ని మాంత్రికులు బారి నుంచి రాక్షసుల బారి నుండి కాపాడే కాశీ మజిలీ కథలు ఎప్పుడూ సజీవాలే. ఆ చిత్రాల కథానాయకుడిగా కాంతారావు అద్భుతంగా రాణించి పేరు తెచ్చుకున్నారు. బి.విఠలాచార్య దర్శకత్వంలో కనకదుర్గ పూజా మహిమ, వరలక్ష్మి వ్రతం, గురువును మించిన శిష్యుడు, చిక్కడు దొరకడు, జ్వాలాదీప రహస్యం వంటి ఎన్నో చిత్రాలలో నటించి జానపద చిత్ర సార్వభౌముడు అనిపించుకున్నారు. చాలా చిత్రాల్లో వారి హీరోయిన్ రాజశ్రీ, కృష్ణ కుమారి. విలన్ గా రాజనాల నటించేవారు. రాజనాల తోనూ, మిగిలిన వారితోనూ, కత్తి యుద్ధ సన్నివేశాలలో ఎంతో చాకచక్యంగా ప్రతిభతో నటించారు. ఒకేసారి రెండు చేతుల్లో రెండు కత్తులు ధరించి ఆయన చేసిన కరవాల విన్యాసం అనితర సాధ్యం అనిపించి, ఆయన ఇంటి పేరు కత్తి గా మారింది. ఆయన అసలు ఇంటి పేరు తాడేపల్లి. ఆయన సినీ రంగానికి చేసిన సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం 2000 సంవత్సరంలో రఘుపతి వెంకన్న పురస్కారం తో సత్కరించింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించారు. రామారావు, నాగేశ్వర రావు లకు సమకాలికులు గా కొన్ని సందర్భాలలో వారికి సమానమైన గుర్తింపు పొందారు. కాంతారావు కుమారుడు రాజా, సుడి గుండాలు చిత్రంలో నటించారు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడుగా నంది అవార్డు అందుకున్నారు. వీరు 2009 లో మార్చి 22 న హైదరాబాద్ లో మరణించారు. వీరి స్వీయ రచన "అనగనగా ఒక రాకుమారుడు". దాసరి నారాయణరావు ఒక సందర్భం లో మాట్లాడుతూ కాంతారావు నీ గూర్చి మాట్లాడుతూ 'తెలుగు చలన చిత్ర సీమకు రామారావు, నాగేశ్వర రావు లు రెండు కళ్లైతే వాటి మధ్య తిలకం వంటి వారు కాంతారావు' అన్నారు.

**డా.జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**పైడిమెట్ట, 9490833108.**

# బాదం మంచి పౌష్టికాహారం



మనింట్లో బాదం చెట్టులోని బాదం వేరు. మార్కెట్‌లో దొరికేవివేరు. పప్పురూపంలో మనం తినే బాదం ప్రూన్స్ జాతికి చెందినవి. దీని శాస్త్రీయనామం ప్రూన్స్ దన్సిస్.

బాదం మొదట్లో చైనా పండించింది. సిల్కురూట్ ద్వారా గ్రీస్, టర్కీ మధ్యతూర్పు దేశాలకు వెళ్లాయి. ప్రస్తుతం వాడే బాదంలో 80 శాతం కాలిఫోర్నియాలోనే పండిస్తున్నారు. 6 వేల మంది రైతులు 4 లక్షల 50 వేల ఎకరాల్లో దీన్ని సాగుచేస్తున్నారు. ఇందుకోసం 12 లక్షల టేనెటీగల తుట్టెలు అవసరం అవుతాయి. వీటిసాయంతో పరపరాగ సంపర్కం జరిగి పూలన్నీ పండ్లవుతాయి. నట్‌గానేకాదు బాదం పండుగాను తింటారు.

ప్రపంచంలో పండే బాదంలో 40 శాతం చాక్లెట్ కంపెనీలే వాడుతున్నాయి. కాలిఫోర్నియాలోని శాక్రిమెంటో ఫ్యాక్టరీ నుంచి రోజు 20 లక్షల పౌండ్ల బాదం గింజలు బయటకు వస్తుంటాయి. గింజలేకదా అని ఎక్కువగా తినకూడదు.

ఎందుకంటే బాదంలో క్యాలరీల శాతం ఎక్కువ. అదే ఆహారంలో భాగంగా రోజు 5 నుంచి 20 వరకు తింటే ఆరోగ్యపరంగా, పోషకపరంగా బోలెడు లబ్ధి కలుగుతుంది.

తల్లిపాలలో లభించే ప్రొటీన్లు బాదంలో ఎక్కువగా ఉంటాయి. విటమిన్ ఇ, మెగ్నీషియం మాంగనీస్ పొటాసియం వంటి మూలకాలు ఎక్కువగా లభిస్తాయి.

వంద గ్రాముల బాదంలో 578 కాలరీల శక్తి, 22 గ్రాముల పిండిపదార్థాలు, 20 గ్రాముల ప్రొటీన్లు, 51 గ్రాముల కొవ్వులుంటాయి. బాదంలో కొవ్వు ఎక్కువగా ఉన్న 62 శాతం మోనో అన్‌శాచురేటెడ్ 24 శాతం పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులుంటే 6 మాత్రమే శాచురేటెడ్ కొవ్వు ఉంటుంది. కొలెస్ట్రాల్ ఉండదు.

ఈ ఫ్యాటీ ఆమ్లాలు గుండెకు మంచిది. శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గించడం ద్వారా బరువు తగ్గడంలో ఇవి దోహదపడతాయి.

బాదం మధుమేహరోగులకు మంచి ఆహారం. బాదంలోని పోలిక్ ఆమ్లం హొమోసిస్టిన్ అనే అమైనో ఆమ్ల శాతాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకోదు. వీటిని గర్భిణీలు తింటే పుట్టే పిల్లల్లో పోలిక్ ఆమ్లం లోపం కారణంగా వచ్చే లోపాలుండవు. క్యాన్సర్, షుగరు, అల్జీమర్స్ వంటివి రాకుండా బాదం దోహదపడుతుంది.

ముఖ్యంగా పేగుక్యాన్సర్ రాదు. బాదంలోని ట్రిప్టోఫాన్ మెదడు పెరుగుదలకు మంచిది. పెరిగే పిల్లలకు రోజు ఐదారు బాదం పెడితే మంచిది. ఇందులోని మెగ్నీషియం గుండెపోటు రాకుండా కాపాడి పీచు మలబద్ధకాన్ని పోగొడుతుంది. బిపిని తగ్గిస్తుంది. మధ్య తూర్పు దేశాల్లో ఆకు పచ్చరంగు బాదంకాయలు తింటారు. కాస్త పుల్లగా ఉండే వీటిని ఉప్పు కలిపి తింటారు.

భారత్ చైనా దేశాల్లో బాదంపాలు ఎక్కువగా తాగుతారు. లాక్టోస్ పడనివారికి ఇవి మంచివి. బాదంలో ఉండే ఓలియం ఎమిగ్డాలే అనే నూనె చర్మానికి ఎంతో మంచిది. అందుకే ఫిజియోథెరపిస్టులు ఈ నూనె మర్దనకు వాడతారు. చర్మం మీద ఉన్న నల్లమచ్చలు తొలగిపోతాయి. సబ్బులు, ఇతర కాస్మోటిక్సులో బాదం పాలు నూనె వాడతారు.

**- యామిజాల జగదీశ్**

## చరిత్రలో ఈ రోజు (మార్చి 22)

**సంఘటనలు:**

1739 : నాదిర్షా ఢిల్లీని ఆక్రమించి నెమలి సింహాసనాన్ని అపహరించాడు.

1946 : బ్రిటిష్ పరిపాలనలో ఉన్న జోర్డాన్‌కు స్వాతంత్ర్యం లభించింది.

1960 : ఆర్థర్ లియొనార్డ్, చార్లెస్ హెచ్ టౌన్స్ లు లేజర్ పై మొదటి పేటెంట్ హక్కులు పొందారు.

1971: భారత లోక్ సభ స్పీకర్ గా గుర్‌దయాళ్ సింగ్ ధిల్లాన్ పదవి స్వీకారం.

1982 : నాసా స్పేస్ షటిల్ 'కొలంబియా' కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుండి ప్రయోగం.

2000: భారత కృత్రిక ఉపగ్రహం ఇన్సాట్-3బి ప్రయోగం విజయవంతం.

**జననాలు:**

1828 : అమరావతి శేషయ్య శాస్త్రి, ఎండోమెంటు డిప్యూటీ కలెక్టరుగా రెండున్నర లక్షల ఒరిజనల్ క్లైమ్స్ పత్రాలను పరిశీలించి అనేక వేల ఎండోమెంటు క్లైమ్స్ పరిష్కరించాడు.

1868 : అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత రాబర్ట్ మిల్లికాన్

1900: యజ్ఞనారాయణ శాస్త్రి, తెలుగు రచయిత, కవి, శతావధానులు.

1920: కట్సుకో సరుహషి జపాన్ దేశానికి చెందిన భూరసాయన శాస్త్రవేత్త.

1907: టేకుమళ్ల కామేశ్వరరావు, విమర్శకుడు.జానపద వాఙ్మయం లోనూ, బాల వాఙ్మయం లోనూ ఎక్కువగా కృషి చేశాడు. పాత పాటలు జోల పాటలు సేకరించి ప్రచురించాడు.

1945: శీల రవిచంద్రన్, కేరళ కు చెందిన నటి, దర్శకురాలు, రచయిత్రి, పలు తెలుగు చిత్రాల నటి

1947: ఎద్మ కిష్టారెడ్డి, రాజకీయ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు.

**మరణాలు:**

1832: గేథే, జర్మనీ రచయిత

2005: జెమినీ గణేశన్, తమిళ నటుడు

2007: ఉప్పులూరి గోపాలకృష్ణ మూర్తి, తత్వవేత్త

2009: టి.ఎల్. కాంతారావు, తెలుగు సినిమా నటుడు

2016: మల్లెల గురవయ్య, కవి, మదనపల్లె రచయితల సంఘం (మరసం) వ్యవస్థాపక అధ్యక్షుడు.

## నవ చేతన నూతన విద్యపై అంగన్వాడీలకు శిక్షణ



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రావికమతం పరిధిలో ఉన్న రావికమతం, రోలుగుంట, బుచ్చయ్యపేట, చోడవరం మండలాల్లో మార్చి 20 నుంచి 22 వరకు అంగన్వాడి కార్యకర్తలకు పోషన్ బి పడా యి బి. ఆదర్శీల, నవచేతన వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడునని ఐసిడిఎస్ పిఓ ఎస్ పుష్ప దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట జడ్పీహెచ్ఎస్ స్కూల్లో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓఎస్ పుష్ప దేవి మాట్లాడుతూ చిన్నారులకు అందించే పోషకాహార వినియోగం వారి ఏదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మూడు రోజులు పాటు ఈ శిక్షణ ఇవ్వబడుతుందని జీరో నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారుల ఎదుగుదల అలాగే మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల అభివృద్ధిపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజరాజేశ్వరి, సంతోషి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## Spoken English -7

@ Conversation Between Doctor and Patient About Fever

- Patient: Good Morning doctor-. గుడ్ మార్నింగ్ డాక్టర్

Doctor: Good morning! You seem pale and your voice sounds different.- :గుడ్ మార్నింగ్, నీవు పాలిపోయినట్లుగా కనిపిస్తున్నావు. స్వరం కూడా తేడాగా వుంది.

Patient: Yes doctor. I'm having a temperature and even a sore throat.- అవును సార్ , నాకు జ్వరంగా వుంది. గొంతి నొప్పి కూడా వుంది.

Doctor: Let me check.- ఏది నన్ను చూడనివ్వండి.

Doctor: You have a moderate fever. Let me check your temperature.- నీకు కొద్దిగా జ్వరం వుంది. నీ టెంపరేచర్ చూడనివ్వండి.

(Doctor uses a thermometer to check the temperature of a patient by snapping around one of the fingers.- రోగి యొక్క టెంపరేచర్ ను చూడటానికి డాక్టర్ థర్మామీటర్ ఉపయోగిస్తాడు)

Patient: This thermometer is different from the last one you used.- గతంలో ఉపయోగించిన దానికంటే విభిన్నంగా వుంది ఈ థర్మామీటర్.

- Doctor: Yes, this is introduced newly by medical supplies companies. It's much more comfortable and doesn't need cleaning after every use.- అవును. మెడికల్ కంపెనీ వాళ్ళు చేత కొత్తగా తేబడింది.ఇది చాలా కంఫర్టబుల్ గా వుంటుంది. ఉపయోగించిన తర్వాత దీనిని కడగనక్కర్లేదు.
- Patient: That's really great.- నిజంగా గ్రేట్ సార్!
- Doctor: Yes it is.- అవును.

(Now he removed the thermometer- ఇప్పుడు ఆయన థర్మామీటర్ ను తీసివేస్తాడు)

- Doctor: Temperature is not too high, around 99.8. Let me check your blood pressure as well.- జ్వరం ఎక్కువగా లేదు. 99.8 డిగ్రీలో వుంది.మీ రక్తపోటు కూడా చూడనివ్వండి.

(He then continues with measuring blood pressure.- ఆయన రక్తపోటును చూస్తున్నాడు..)

- Doctor: Your blood pressure is fine.- మీ రక్తపోటు బాగానే వుంది.

(Now, he checks the throat.- ఇప్పుడు గొంతును పరిశీలిస్తున్నాడు)

-::Doctor: It seems a bit scruffy. Not good.- ఇది కొద్దిగా గజిబిజీ గా వుంది. మంచిగా లేదు.

-Patient: Yes, it has been quite bad.- అవును కొద్దిగా బాగోలేదు.

-:Doctor: Do you sweat and shiver?- చెమట పట్టడం, వణుకు ఏమైనా ఉన్నాయా?

-:Patient: Not sweating, but I feel slightly cold when I sit under a fan.-:చెమట లేదు గానీ ఫ్యాన్ కింద కూర్చున్నప్పుడు కొద్దిగా జలుబు/ సర్ది/ రొంప గా ఉంటోంది.

- Doctor: Ok. You have few signs of malaria. I would recommend you undergo a blood test.- సరే, నీకు కొద్దిగా మలేరియా లక్షణాలు కనిపిస్తున్నాయి.రక్త పరీక్ష కు పంపుతాను. -

Nothing to worry about.- భాద పడవలసిన అవసరం లేదు.

In most cases, the test comes out to be negative. - చాలా కేసుల్లో టెస్ట్ నెగెటివ్ గా వస్తుంది.

It's just careful, as there has been a spurt in malaria cases in the last month or so.- గత నెలలో మలేరియా కేసుల్లో పెరుగుదల కనిపించింది కాబట్టి కొద్దిగా జాగ్రత్త గా వుంటే చాలు.

- Doctor: I am writing three medicines and syrup. - నేను 3 రకాలైన మందులు, ఒక అరుకు రాస్తున్నాను.. The number of dots in front of each medicine name tells you how many times in the day you have to take them. - ప్రతీ మందు పేరు ముందు వుండే చుక్కలు పగలు ఎన్నిసార్లు మందులు వేసుకోవాలన్నది తెలియజేస్తుఃది. For example, the two dots here mean you've to take the medicine twice in the day, once in the morning and once after dinner.- ఉదాహరణకు ఇక్కడ రెండు చుక్కలు ఉన్నాయనుకో దానర్థం పగలు రెండు సార్లు అనగా ఉదయం, సాయంత్రం డిన్నర్ తర్వాత తీసుకోవాలి

- Doctor: Do you have any other questions?- ఇంకేమైనా ఇతర సందేహాలున్నాయా?
- Patient: No, doctor. Thank you.- లేవు డాక్టర్, ధన్యవాదములు.

**By Dr.P.V.Ram, 9553574250**

# ఎంపీటీసీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు

**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** మండలం లోని కొత్తకోట వన్ ఎంపీటీసీ కుంచా లక్ష్మి శంకర్ కృషితో శుక్రవారం కొత్తకోట కాపులుదిబ్బ శివారు నుంచి బూరుమాను కట్టు వరకు ఆరు లక్షల రూపాయలు పైచిలుకు వ్యయంతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణపు పనులకు ఈరోజు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొత్తకోట1.ఎంపీటీసీ కుంచ శంకర్ నిధులు సుమారు రెండు లక్షల రూపాయలు పైచిలుకు వ్యయంతో బూరుగుమాను కట్టు సమీపానగల స్మశాన వాటిక నందు నిర్మించబోయే వెయిటింగ్ హాలు హాలుకు భూమి పూజకార్యక్రమం నిర్వహించారు. ఇటీవలే కొద్ది రోజుల క్రితం కొత్తకోట 1 ఎంపీటీసీ నిధులతో కొత్తకోట శ్రీ శ్రీ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంచినీటి సౌకర్యం నిమిత్తం కొద్దిరోజుల క్రితం వేయించిన బోరును ఈరోజు ప్రారంభించారు. అనంతరం తొలిసారిగా వచ్చిన నీళ్లతో స్వామివారి ఆలయ సన్నిధిలో గల శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భం పురస్కరించుకొని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ



పాలకమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు అందరిని వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో కండువాళతో సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ ..మండల వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి శీలం.శంకర్రావు, ఎంపీటీసీ కుంచా శంకర్రావు, భీమరాతి వెంకట్,మళ్ళీ చిరంజీవి,కోసిరెడ్డి శివాజీ,పూడి నాగరాజు, విసారపు రమణ,కొసిరెడ్డి సత్తిబాబు, ప్రిన్స్ టైలర్ రాజు,మిద్ది కనకరాజు, గన్రెడ్డి శంకర్రావు సంబంధిత కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ తీర్మానంపై ఎంఆర్పీఎస్ హర్షం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఎస్సీ వర్గీకరణ కు రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయడం పట్ల ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఎంఆర్పిఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పక్షాన మరియు ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ తరుపున ఎంఆర్పిఎస్ ధన్యవాదాలు.

ఎస్సీ వర్గీకరణ పై అధ్యయనానికి నియమించిన ఏక సభ్య కమిషన్ నివేదికను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగలు ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోకు సురేష్ మాదిగలు పేర్కొన్నారు.

క్యాబినెట్ తీర్మానంలో మాల, మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయం తో అంగీకరించడం శుభ పరిణామమన్నారు.

హార్బవెల్లి జంక్షన్ లోని సాయి ఆదిత్య కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 59 ఎస్సీ ఉపకులాలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం 15 శాతం రిజర్వేషన్ను న్యాయబద్ధంగా కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ఎస్సీ ఏ - రెల్లి ఉప కులాల ప్రజలకు 1శాతం, బీ గ్రూప్ మాదిగ, ఉప కులాలకు 6.5 శాతం, సీ గ్రూప్ మాల, ఉపకులాలకు 7.5 శాతం గా పంచడం జరిగిందన్నారు.

ఈ విధానం అంబేద్కర్ స్ఫూర్తి కి నిదర్శనం అని తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకొని విద్యా, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో అమలు చేయడం హర్షనీయమన్నారు.

వర్గీకరణ అమలు అయ్యేంతవరకు అన్ని విభాగాల్లో ఉద్యోగ నియమకాలు నిలుపుదల చేయాలని సూచించారు.

అలాగే వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఉద్యోగులకు ప్రమోషన్ లో రిజర్వేషన్లు వెంటనే నిలువుదల చేయాలని కోరారు.

ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేసి, జాతీయ ఎస్సీ కమిషన్ అనుమతికి పంపాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ ఎస్సీ కమిషన్ రిపోర్ట్ వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ళ నుండి సుదీర్ఘ పోరాటం చేసి మాదిగ, ఉపాకులాల ప్రజలను తీరాలకు చేర్చిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారికి యావత్ మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఉత్తరకొస్తా జిల్లాల ఎంఎస్పి ఇంచార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరేల్లి ఎలిషా మాదిగ, ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఎస్పి, ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ రాణా శ్రీనివాస్ మాదిగ, ఉత్తరాంధ్ర జిల్లాల సీనియర్ నాయకులు ఈవీఆర్వీ కుమార్ మాదిగ, ఎంఎస్పి సీనియర్ నాయకులు తొత్తరమూడి శ్రీనివాస్ మాదిగ, విశాఖ జిల్లా అధ్యక్షులు అంజూరి దీపక్ మాదిగ, ఎంఎస్పి విశాఖ జిల్లా అధ్యక్షులు కింతాడ రాజశేఖర్ మాదిగ, విశాఖ జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షులు అత్తోట రవి మాదిగ, అనకాపల్లి జిల్లా ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు ఎలాకా మల్లి బాబు మాదిగ అనకాపల్లి ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు ఘాటీలు మాదిగ, ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు గోటివాడ నరసింగరావు మాదిగ, చలం మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలి



**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):-** ప్రజల కోసం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా స్థానిక సమస్యలపై శుక్రవారం వెదురువాడ, గొర్లిధర్మవరం, మడుతురు పంచాయతీల్లో వీధుల్లో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి సిపిఎం బృందం తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వెదురువాడ సర్వే నెంబర్ 1 లో 100 ఎకరాలు సుమారు 142 మందికి ఇచ్చిన భూమికి ఏపీఐఐసీ తీసుకున్న భూమికి నష్టపరిహారం ఇవ్వాలని, వెదురువాడ, గొర్లి ధర్మవరం, మడతూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు లేక పేదలు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని కల్పించకపోతే భృతి ఇవ్వాలని చట్టంలో ఉన్న అధికారులు నేటికీ పనులు కల్పించలేదని వెంటనే మూడు పంచాయితీలో ఉపాధి పనులు వెంటనే ప్రారంభం చేయాలని తెలిపారు, అలాగే మడతూరు దళిత కాలనీలో మంచినీరు రాక ఇబ్బందులు పడుతున్నామని గతంలో మంజూరైన ఇల్లు స్కీము బిల్లులు వెంటనే ఇవ్వాలని చదువుకునే యువతకు ఎస్సీ జడ్ పరిశ్రమల్లో ఉపాధి కల్పించడం లేదని ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న పథకాలు 1500, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం లాంటి పథకాలు ఇస్తే బాగుంటుందని, కరెంటు చార్జీలు తగ్గించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్. రాము మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలపై కార్యచరణ రూపొందించి భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సిద్ధం చేస్తామని వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కే. సోమినాయుడు, గాలి .అప్పారావు ,శ్రీను, వంకర. భవాని, జీ .రమణ, ఇరుగుల .రాణి ,వంకర. పైడిరాజు ,బి .శ్రీను ,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# దుప్పుతూరు, చినపూడి గ్రామాలను తరలించాలి



**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):-** ప్రజల కోసం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా స్థానిక సమస్యలపై ఈరోజు దుప్పుతూరు, చినపూడి గ్రామంలో వీధుల్లో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి సిపిఎం బృందం తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పిన సమస్యలు 20 సంవత్సరాలుగా దుప్పుతూరు గ్రామాన్ని తరలిస్తామని అనేకసార్లు ప్రభుత్వాలు మాట ఇచ్చి మాట తప్పయని దుప్పుతూరు గ్రామంలో రేకుల షెడ్ లోని ఎండకుఎండి వానకు ఇల్లు కారి తడిసి ఇబ్బందులు పడుతున్నామని వందల మందికి ఇంటి స్థలాలు లేక ప్రభుత్వం పేదలకు ఇస్తున్న స్థలాలు కూడా ఈ గ్రామంలో ఊరు తరలిస్తామని చెప్పి ఇవ్వడం లేదని, తాగడానికి మంచినీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని దుప్పుతురు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం చేయకపోవడం వలన పేదలకు పనులు లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, చినపూడి గ్రామాన్ని తరలించి కాలుష్యం నుంచి రక్షించాలని ట్రీట్మెంట్ ప్లాంట్ వలన వచ్చే విష కాలుష్యం వలన చుట్టూ పరిశ్రమలు నుండి వచ్చే శబ్ద కాలుష్యం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చదువుకునే యువతకు ఎస్సీ జడ్ పరిశ్రమల్లో ఉపాధి కల్పించడం లేదని ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న పథకాలు 1500, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం లాంటి పథకాలు ఇస్తే బాగుంటుందని, కరెంటు చార్జీలు తగ్గించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్. రాము మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలపై కార్యచరణ రూపొందించి భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సిద్ధం చేస్తామని వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కే. సోమినాయుడు, సురప్పారావ్ ,అప్పలరాజు, ఉష అప్పారావు, లాలం. అచ్చి అమ్మా తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్‌లో ఖాళీలు



ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ ముంబయి వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 10వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

**విభాగాలు:** ఫైనాన్స్, హెచ్ఆర్ఎం, రాజ్‌భాష, బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్, సివిల్, టెక్నికల్,

పోస్టు పేరు-ఖాళీలు

1. జనరల్ మేనేజర్(ఫైనాన్స్): 01
2. డిప్యూటీ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): 01
3. చీఫ్ మేనేజర్(ఫైనాన్స్): 01
4. సీనియర్ మేనేజర్(ఫైనాన్స్): 01
5. అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్): 02
6. డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్ఎం): 01
7. చీఫ్ మేనేజర్(హెచ్ఆర్ఎం): 01
8. అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్ఎం): 02
9. అసిస్టెంట్ మేనేజర్(రాజ్‌భాష): 02
10. డిప్యూటీ జనరల్ మేనేజర్(బిజినెస్ డెవలప్‌మెంట్ ): 01
11. డిప్యూటీ మేనేజర్ (మార్కెటింగ్): 02
12. చీఫ్ మేనేజర్(సివిల్): 01
13. మేనేజర్(సివిల్): 03
14. డిప్యూటీ మేనేజర్(సివిల్): 01
15. డిప్యూటీ జనరల్ మేనేజర్(టెక్నికల్): 01
16. డిప్యూటీ జనరల్ మేనేజర్(కమర్షియల్): 01
17. డిప్యూటీ జనరల్ మేనేజర్( ప్రాజెక్ట్స్): 01
18. చీఫ్ మేనేజర్(ప్రాజెక్ట్స్): 01
19. చీఫ్ మేనేజర్(కమర్షియల్): 01
20. మేనేజర్(ఎలక్ట్రికల్): 03
21. మేనేజర్(మెకానికల్): 01
22. డిప్యూటీ మేనేజర్(మినరల్): 01

మొత్తం ఖాళీల సంఖ్య: 30

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, సీఎంఏ, ఎంబీఏ, బీకాం, ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, మాస్టర్స్ డిగ్రీ, బీఈ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 46 ఏళ్లు, చీఫ్ మేనేజర్‌కు 42 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 38 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 28 ఏళ్ల మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000 - రూ.2,60,000, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.90,000 - రూ.2,40,000, చీఫ్ మేనేజర్‌కు రూ.80,000 - రూ.2,20,000, సీనియర్ మేనేజర్‌కు రూ.70,000 - రూ.2,00,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.40,000 - రూ.1,40,000.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ 500బీ ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.

దరఖాస్తుకు చివరి తేదీ: 10-04-2025.

## ఎన్‌సీఈఎస్ఎస్-కేరళలో సైంటిస్ట్ ఖాళీలు



కేరళలోని నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ తిరువనంతపురం ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 7వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు - ఖాళీలు

సైంటిస్ట్-బి(1, 2): 02

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, బీటెక్( సివిల్ ఇంజినీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: సైంటిస్ట్ బీ1 పోస్టుకు 35 ఏళ్లు, సైంటిస్ట్ బీ2 పోస్టుకు 38 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ ద్వారా.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.

## హాల్‌లో టెక్నీషియన్ పోస్టులు

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

పోస్టు వివరాలు: ఖాళీలు

టెక్నీషియన్ (మెకానికల్): 06, సివిల్: 01, అకౌంట్స్: 01

స్టోర్స్ క్లరికల్/ కమర్షియల్ అసిస్టెంట్/ అడ్మిన్ అసిస్టెంట్: 01

మొత్తం పోస్టుల సంఖ్య: 09

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిప్లొమా, బీకాం, బీఏ, బీఎస్సీ/బీబీఏ/బీసీఏ/ బీఎస్‌డబ్ల్యూ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్కిల్స్ ఉండాలి.

**వయోపరిమితి:** 01.03.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.

చిరునామా: డిప్యూటీ జనరల్ మేనేజర్, హెలీక్యాప్టర్ డివిజన్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, బెంగళూరు చిరునామాకు స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్/ కొరియర్ ద్వారా పంపించాలి.

దరఖాస్తు చివరి తేదీ: 05.04.2025.

## లేజర్ స్క్రీన్ థియేటర్‌లో బొజ్జన్న కొండ చరిత్ర సందర్శకులకు ప్రదర్శించాలి



**అనకాపల్లి (విశాఖ సమాచారమ్):-** స్థానిక సిద్ధార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి మణిహారం శంకరం లో గల ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయ నిధులతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నూతనంగా నిర్మించిన బొజ్జన్న కొండచరిత్రను విశిష్టతలను ప్రాముఖ్యతలను తెలిపే చిత్రప్రదర్శనను ప్రదర్శించే లేజర్ స్క్రీన్ థియేటర్ ను పర్యాటకులకు ఫుడ్ కోర్టులను ( క్యాంటీన్ ) అందుబాటులోకి తేవాలని జిల్లా బుద్ధిస్ట్ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్ల కార్డులు పట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకలెక్టర్ శ్రీమతి కె.విజయక్రిష్ణన్ కి ఈ సమస్యల పరిష్కారము చేయ వలసిందిగా కలెక్టరు కార్యాలయ డి.ఆర్.ఓ.. వై.ఎస్. సత్యనారాయణ కి బల్లా నాగభూషణము ఇతర సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్, కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బిమల్లేశ్వరరావు, కార్యవర్గసభ్యులు బొడ్డు సోమరాజు, జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు బండి అప్పారావు, పి.దయాల్ రాజ్ పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో అభ్యంతరాలు స్వీకరణ

- ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకరించాలి
- జిల్లా రెవిన్యూ అధికారి వై సూర్యనారాయణ రావు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఓటరు జాబితాలో సమస్యలు, అభ్యంతరాలు ఉంటే బూత్ లెవెల్ అధికారికి గాని, అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారికి గాని లేదా ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారికి తెలియజేయ్యా లని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా రెవిన్యూ అధికారి వై సూర్యనారా యణ రావు సూచించారు. గురువారం జిల్లా రెవిన్యూ అధికారి ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో అయన ఓటరు జాబితాల సవరణలో భాగంగా సమావేశాన్ని నిర్వహించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ. ఎన్నికల సంఘం వారి ఆదేశాలు ప్రకారం ఓటర్లు జాబితా తయారీ చేయుట కోసం అన్ని రాజకీయ పార్టీల తో సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగిందని అయన తెలిపారు. ఓటురు జాబితాలో అసెంబ్లీ స్థాయిలో పరిస్కరం కాని సమస్యలు మరియు అభ్యంతరాలు ఉన్న, ఓటురు జాబితాలో ఎవరైనా అన్నార్హులు ఉన్న బి ఎల్ ఓ లకు గాని, ఎ ఈ ఆర్ ఓ లకు లేదా ఈ ఆర్ ఓ ల దృష్టికి తీసుకురావలని రాజకీయ పార్టీల నాయులను కోరారు, ఓటర్ల జాబితా లో మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ కానుక రాజకీయ పార్టీల ప్రతినిధులు జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూలమైన సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బూత్ స్థాయి అధికారుల నియామకం, ఓటరు జాబితాలను నాణ్యతగా తయారు చేసేందుకు, మెరుగుపరిచేందుకు మరింత మంది బూత్ స్థాయి అధికారులు, ఎలక్ట్రోరల్ అధికారుల నియామకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయ న్నారు, అలాగే మంచి ఓటర్లు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించా లని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యనారాయణ రావు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి. నాయుడు, టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కె ఎం నాయుడు, వి వి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు గంట శ్రీరాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసాల సుబ్బన్న, మల్లపాటి కోటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు హరినాథ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు




**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):-** వేసవి తాపం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు త్రాగు నీటి సౌకర్యం కలిగేలా కూడళ్లలో మంచి నీటి చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తాళ్లపూడి మండల ఇంచార్జి తహశీల్దార్ మోహన భారతి తెలిపారు. గ్రామ వి.ఆర్.ఓ ల ద్వారా తాళ్లపూడి మండలంలో ఉన్న ప్రతి గ్రామం లోను వీటిని ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు. అవసరాన్ని దృష్టి లో పెట్టుకుని మరి కొన్ని చోట్ల ఏర్పాటు చేస్తామని భారతి పేర్కొన్నారు.

## తూ దీనమ్మ జీవితం వెబ్ సిరీస్ ప్రారంభం

### డైరెక్టర్ రాజ్ కిరణ్ ఆధ్వర్యంలో షూట్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** ఐ.డి.ఆర్. ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై రాజ్ కిరణ్ దర్శకత్వంలో తూ దీనమ్మ జీవితం వెబ్ సిరీస్ ప్రారంభమైంది. అనకాపల్లి విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే షూటింగ్ మొదలైంది. ఈ సందర్భంగా దర్శకులు రాజ్ కిరణ్ మాట్లాడుతూ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ స్ట్రగుల్స్ నేపథ్యంలో కదాంశం సాగుతుందన్నారు. చిత్రీకరణ శరవేగంగా ముందుకెళుతుందన్నారు.వెబ్ సిరీస్ "తూ దీనమ్మా జీవితం. పైడి శ్రీనివాస్, పాటూరి శంకర్ రావు, నిహారిక, డాక్టర్ శ్రీవాణి, ప్రదీప్ బట్ట, రమ్య, సునీత ప్రధాన పాత్రదారులుగా తెరకెక్కుతున్న ఈ వెబ్ సిరీస్ మొత్తం వైజాగ్ పరిసర ప్రాంతాలలోనే షూటింగ్ జరుగుతాదన్నారు. ఏ.ఆర్.రెహమాన్ శిష్యుడు ప్రేం చంద్ కంచర్ల ఈ వెబ్ సిరీస్ కి మ్యూజిక్ అందిస్తుండగా ఎం.రవికిరణ్, ఆర్కే సింగ్ కో డైరెక్టర్లుగా, శాంతిప్రియ అసోసియేట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

# గురుకులాల్లో ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు మార్చి 25 వరకు గడువు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వారు 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్, 5వ తరగతిలో ప్రవేశం కొరకు ఆసక్తి కలిగిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 15వ తేదీ తో ముగియగా, దరఖాస్తుకు మరల మార్చి 25 తారీకు వరకు పొడిగించడం జరిగిందని అనకాపల్లి జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల కన్వీనర్ శ్రీ దేవర శెట్టి వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

ఇంటర్మీడియట్ (బాలికలు) కొరకు పరవాడ మండలం తానాం గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల కళాశాలలో, అలాగే ఇంటర్మీడియట్ (బాలురు) కొరకు సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల ల్లో బాలురకు తానం (పరవాడ), చోడవరం, పాయకరావుపేట లో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకులాల్లో బాలికలకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉంటుందని అనకాపల్లి జిల్లా కన్వీనర్ శ్రీ దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలియజేశారు.

ప్రవేశ పరీక్షలో స్థానం సంపాదించిన విద్యార్థులకు అనుభవం కలిగిన అధ్యాపక బృందంతో ఉత్తమ శిక్షణ, ఉచిత విద్య,వసతి కల్పించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యా కానుక,ఉచిత యూనిఫామ్, ఉచితంగ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందనిబీ యోగ, స్పోర్ట్స్, క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల తేదీ:25-3-2025 లోపల ఆన్లైన్ (website:https://mjpap-bcwreis.apcfss.in) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్ లో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు తేదీ:20-4-2025 రోజున.

5వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు తేదీ: 27-4-2025 రోజున ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** ఏపీయూడబ్ల్యూజే అనుబంధ సంఘం పరవాడ మండలం ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యవర్గ సమావేశం లంకెలపాలెంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి వివిధ అంశాలపై సభ్యులతో చర్చించినట్లు అధ్యక్షులు నారపిన్ని గణేష్ పత్రికా ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా వర్కింగ్ జర్నలిస్టుల జీవిత, ఆరోగ్య భీమ, ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు, తదితర అంశాలపై సభ్యులతో చర్చించినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గణేష్( ప్రైమ్ నైన్), కార్యదర్శి నాయుడు (ఏబీఎన్), ఉపాధ్యక్షులు విందుల మోహన్ (10టీవీ) కార్యదర్శి సీరం అప్పలరాజు (మహా న్యూస్) సభ్యులు పైల శ్రీను (99 టీవీ) యల్లపు శేషు (టీవీ9) దొడ్డి కృష్ణ (ఎన్టీవీ) రాజు (ఈటీవీ) సురేష్ (ఏఎన్ఎం), రమేష్ (జిపిటిఎల్), గెట్ట వెంకటరమణ (స్మార్ట్ నైన్ టివి) పాల్గొన్నారు.

## గజ్జరం మాదిగ పేటలో నూతన బోరు



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్ళపూడి మండలం గజ్జరం గ్రామంలో ఎస్సీ కాలనీలో గత కొన్నాళ్ళుగా వాడుక నీరు సరిగా రాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు . పాత బోరు వలన నీరు రాక అనేక యిబ్బందులు పడ్డారు. దీని స్థానంలో మరొక కొత్త బోరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

సూమారు రెండు లక్షల పైబడిన ఖర్చులతో బోరు నిర్మాణం జరుగుతుందని అంచనా! వాడుక నీరు కొరత సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించిందంటూ ప్రజలు హర్షం తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కొర్లపాటి లక్ష్మణరావు (దత్తుడు), సర్పంచ్ గండి రాంబాబు, మద్దుకూరి నారాయణ వరప్రసాద్, దండమూడి శేషు, కాకర్ల ఆదిత్య, పెదవేగి బాలాజీ, పూలపల్లి బాలకృష్ణ గ్రామ పెద్దలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి కన్నతండ్రిని కడతేర్చిన కూతురు



**మండపేట (కోనసీమ) :** ప్రియుడితో కలిసి కన్నతండ్రిని కూతురు హత్య చేసిన ఘటన కోనసీమ జిల్లా మండపేటలో జరిగింది. మండపేట టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండపేట మేదరిపేటకు చెందిన సురా రాంబాబు కు వస్త్రాల వెంకట దుర్గ అనే కూతురుంది. ఆమె భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి స్థానికంగా నివసిస్తుంది. ఇదిలా వుండగా రామచంద్రపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సురేష్ తో దుర్గ అక్రమ సంబంధం ఏర్పరచుకుంది. కొన్నాళ్లకు ఈ విషయం తెలియడంతో భర్త ఆమె నుండి విడిపోయి అదే ప్రాంతంలో ఒంటరిగా ఉంటున్నాడు. దుర్గ తీరులో మార్పు రాకపోవడంతో తండ్రి రాంబాబు గట్టిగా మందలించాడు. దీంతో ఎలాగైనా తండ్రిని మట్టుబెట్టాలనుకుంది. ఈ మేరకు ఈ నెల 16వ తేదీన కొత్తూరు లో ఉన్న ప్రియుడికి ఫోన్ చేసి వచ్చి తన తండ్రిని చంపేయాలని చెప్పింది. దీంతో ప్రియుడు సురేష్ తన స్నేహితుడు తాటికొండ నాగార్జున ను వెంటబెట్టుకుని వచ్చి, దుర్గ తండ్రి రాంబాబు కాళ్లను ఒకరు పట్టుకోగా, ఛాతీపై మరొకరు కూర్చుని పీక నులిమి చంపేశారు. అయితే మఅతుడు రాంబాబు సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మఅతిగా కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం రిపోర్టులో అది హత్యగా తేలింది. పోలీసులు చేపట్టిన విచారణ లో పక్కా ప్రణాళిక ప్రకారమే తండ్రిని చంపినట్లు దుర్గ అంగీకరించింది. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి గురువారం రామచంద్రపురం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించి నట్లు టౌన్ సీఐ సురేష్ తెలిపారు.

## జనసేనలో చేరిన వైసీపీ ఉప సర్పంచ్



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్లపూడి మండలం , పైడిమెట్ట గ్రామం, ప్రక్కిలంక పంచాయతీ ఉపసర్పంచ్ విత్తం నాని జనసేన పార్టీలో చేరారు.

వివరాల్లోకి వెళితే కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు మరియు జిల్లా కార్యదర్శి గాయత్రి వెంకటేశ్వరరావుల సమక్షంలో విత్తం వీర వెంకట సత్యనారాయణ (నాని) జనసేన కండువా కప్పుకొన్నారు.

ఈ కార్యక్రమంలో కొలకలూరు సత్యనారాయణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

# ఏప్రిల్‌లో పెళ్లిల్లే.. పెళ్లిళ్లు..

### ఇన్ని ముహూర్తాలు కుదరడం చాలా అరుదు



పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే సాధారణంగా ఒక నెలలో రెండు, మూడు, మాక్సిమం ఐదు ముహూర్తాలు ఉంటాయి. కాని ఈ ఏప్రిల్ నెలలో వచ్చినన్ని ముహూర్తాలు గతంలో ఎప్పుడూ వచ్చి ఉండవు. ఆ పెళ్లి ముహూర్తాల తేదీలు, సమయాలు, పండితుల సలహాలు తెలుసుకుందాం రండి.

ఎవరింట్లో అయినా శుభ కార్యం చేయాలంటే ముహూర్తం చూడటం మన సంప్రదాయం. ముఖ్యంగా పెళ్లిళ్లకు కచ్చితంగా శుభ ముహూర్తం చూస్తారు. కొంతమంది ముహూర్తం కుదరలేదని నెలల తరబడి పెళ్లిళ్లు వాయిదాలు కూడా వేస్తారు. ముహూర్తాలకు అంత ప్రత్యేకత ఉంది. మరి ఏప్రిల్ 2025లో ఎన్ని పెళ్లి ముహూర్తాలు ఉన్నాయో తెలుసుకుందాం రండి.

హెూళీ వేడుకల సందర్భంగా కొన్ని రోజుల వరకు ముహూర్తాలు ఉండవు. ముఖ్యంగా పెళ్లిళ్లు చేయడానికి ఈ సమయం మంచిది కాదు. ఎందుకంటే ప్రస్తుతం మూఢం నడుస్తోంది. ఈ సమయంలో శుభ కార్యాలు చేయకూడదు. ఈ మూఢం అయిపోయే నాటికి ఏప్రిల్ నెల ప్రారంభమవుతుంది. ఆ నెలలో ఎన్నో శుభ ముహూర్తాలు ఉన్నాయి. ముఖ్యంగా పెళ్లిళ్లు చేయడానికి మంచి ముహూర్తాలు ఉన్నాయి.

**ఏప్రిల్‌లో పెళ్లి ముహూర్తాలు..:**

ఏప్రిల్ నెల మొత్తం మీద 9 పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. ఇంత ఎక్కువగా పెళ్లి ముహూర్తాలు చాలా అరుదుగా వస్తుంటాయి. సాధారణంగా పెళ్లి ముహూర్తం కుదరాలంటే చాలా అంశాలను పరిగణించాల్సి ఉంటుంది. జాతకాలు, గ్రహ స్థితులు, గోచారాలు, తారాబలం, వధూవరుల గణన, రాశి ఫలాల పొంతన, ఇలా ఎన్నో అంశాలు కలిస్తేనే ఒక మంచి పెళ్లి ముహూర్తం సెట్ అవుతుంది. మీ ఇంటిలో పెళ్లి వేడుక చేయాలనుకుంటే ఏప్రిల్ నెలలో కచ్చితంగా మంచి ముహూర్తం కుదురుతుంది. ఇన్ని ముహూర్తాల్లో ఏదో ఒకటి కచ్చితంగా సెట్ అవుతుంది. ఏప్రిల్ నెలలో 13 వ తేదీ వరకు మూఢం ఉంది. దీంతో పాటు సూర్యుడు కుంభ రాశి నుంచి మీన రాశిలోకి ప్రవేశిస్తున్నాడు. అందువల్ల 13 వరకు పెళ్లి ముహూర్తాలు లేవు. అంటే ఏప్రిల్ నెలలో సగం రోజులు పెళ్లి ముహూర్తాలు లేవు. నెల సగం అయిన తర్వాత నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. అంటే కేవలం 16 రోజుల్లో 9 ముహూర్తాలు ఉన్నాయన్న మాట.

**పెళ్లి ముహూర్తాలు ఉన్న తేదీలు..:**

మార్చి 30న ఉగాది కావున అప్పటి నుంచి కొత్త సంవత్సరమైన విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. విశ్వావసు నామ సంవత్సరం చైత్ర మాసం, బహూళ పక్షం పాడ్యమి తిథి నుంచి మంచి ముహూర్తాలు ప్రారంభమవుతున్నాయి.

ఏప్రిల్ 14(పాడ్యమి), ఏప్రిల్ 16(తదియ), ఏప్రిల్ 18 (పంచమి), ఏప్రిల్ 19(షష్ఠి), ఏప్రిల్ 20(సప్తమి, అష్టమి), ఏప్రిల్ 21(అష్టమి, నవమి), ఏప్రిల్ 25 (ద్వాదశి), ఏప్రిల్ 29(శుక్ల విదియ), ఏప్రిల్ 30(శుక్ల తదియ). ఈ తేదీల్లో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. మీ జాతకరీత్యా ఈ తిథుల్లో ఏ నక్షత్రానికి మంచి ముహూర్తం సెట్ అవుతుందో మీకు దగ్గర్లో ఉన్న ఆలయంలో పండితులను అడిగి ముహూర్తం పెట్టించుకోండి.

## కస్తూరిబా గాంధీ విద్యాలయాలలో ప్రవేశ దరఖాస్తులకు ఆహ్వానం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో (కేజీబీవీ) 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు గాను రాష్ట్ర పథక సంచాలకులు ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అమరావతి వారు ప్రకటన విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష జిల్లా ప్రోజెక్టు అధికారి ఆర్. జయప్రకాష్ తెలిపారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ అనకాపల్లి జిల్లాలో గల 20 ( టైప్-3) కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో (కేజీబీవీ) 6,11 తరగతులలో ప్రవేశాలతో పాటు 7,8 మరియు 9 తరగతులలో ఖాళీలను కూడా భర్తీ చేయుటకు గాను ఈ నెల తేదీ 22 నుండి ఏప్రిల్ 11 వరకు ఆన్లైన్ లో దరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో 20 విద్యాలయంలో 1600 సీట్లు కు ప్రవేశాలకు కల్పించామన్నారు.కావున అనాధలు బడి బయట ఉన్న బాలికలు, డ్రాపౌట్స్, దారిద్ర రేఖకు దిగువ ఉన్న బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీలు, వలస కార్మికులు, తల్లిదండ్రులలో ఒకరే ఉన్నవారు అర్హులని అటువంటి వారి నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని తెలిపారు. వార్షిక ఆదాయము గ్రామీణ ప్రాంతాలలో రూపాయలు 1.20 లక్షలు పట్టణ ప్రాంతాలలో 1.40 లక్షలు ఉన్నవారు మాత్రమే అర్హులని తెలియజేసారు. మరియు అర్హులైన బాలికలు కేజీబీవీ లలో దరఖాస్తులు చేసుకునేందుకుగాను బాలికతో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికేట్, ఒక పాస్పోర్ట్ ఫోటో తో పాటు ఫోన్ నెంబరు ఉంటే http://apkgbv.apcfss.in దరఖాస్తు చేసుకొనవచ్చు లేదా దగ్గరలో ఉన్న కేజీబీవీకి వెళ్లి దరఖాస్తును ఆన్లైన్లో నమోదు చేయవలేనని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి తెలిపారు. అర్హులైన బాలికలు ఈనెల 22 తేది నుండి ఏప్రిల్ 11 తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవలసినదిగాను, ఇందు విషయమై ఎటువంటి సందేహములకైనను సమగ్ర శిక్ష అనకాపల్లి వారి కార్యాలయంలో ఫోన్ నెంబరు 7729882022 ను సంప్రదించవలసిందిగా కోరారు.

## 72 రోజులకు శ్రీవారి హుండీ ఆదాయం రూ. 6.22 లక్షలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** పట్టణంలో గల దేముని గుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవదాయ ఇన్స్పెక్టర్ వసంత్ కుమార్ పర్యవేక్షణలో దేవాలయం చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు కార్య నిర్వహణ అధికారి టి రాజ సులోచన దేవాలయం ప్రధాన అర్చకులు పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో శ్రీవారి సేవకులు హుండీ లెక్కించగా 72 రోజులకు ఆరు లక్షల 22 వేల 53 రూపాయలు భక్తుల ద్వారా స్వామివారికి హుండీ ఆదాయం లభించిందని ధర్మకర్తల మండలి చైర్మన్ ,కార్యనిర్వాహణాధికారి తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గోలి మురళి, వేదుల సూర్యప్రభ, సిహెచ్ నూకరాజు, కొణతాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 13వ వార్షికోత్సవం

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** అరకు వేలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎల్ హిమగిరి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులందరూ నేటి విద్యా విధానాన్ని అనుసరిస్తూ ఉన్నత స్థాయిని అధిరోహించాలన్నారు డిగ్రీ పూర్తి చేసుకొని వెళుతున్న విద్యార్థులు మరింత ఉన్నత జ్ఞానాన్ని సంపాదించడం కోసం ప్రయత్నం చేయాలన్నారు సీనియర్ విద్యార్థులను జూనియర్స్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు మరియు చెడు అలవాట్లకు దూరంగా ఉండి గంజాయి,నాటు సారా,ఖైనీ,గుట్కా ,సైబర్ క్రైమ్ అలాగే ఆన్లైన్ మోసలకు దూరంగా ఉండి మీయొక్క తల్లిదండ్రులకు అలాగే కాలేజీ యాజమాన్యం కు మరియు అల్లూరి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భరత్ కుమార్ నాయక్ ,సి పి డి సి నెంబర్ మయూరి రాజు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పి కొండబాబు, ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు పి నాగబాబు, వై విజయలక్ష్మి, ఎం అనిత కుమారి, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె ధర్మారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు మహిళా కళాశాలల అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా వచ్చిన సిఐ గారిని కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది సాలువతో సత్కరించారు. అనంతరం కళాశాలకి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులందరికి మెమెంటోలు బహుకరించారు.

## నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేయాలి

**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా శుక్రవారం వడ్డాది తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు దొండా నరేష్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ వారి కార్యాలయంలో బుచ్చయ్యపేట మండలంలో ఉన్న మొత్తం 20 నాయిబ్రాహ్మణుల షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వర్తించేలా చేయాలని బుచ్చయ్యపేట మండల నాయి బ్రాహ్మణులు సంఘం సభ్యులు, కూటమి నాయకులతో కలిసి అసిస్టెంట్ ఇంజనీర్ వారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపేట మండల నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు కాకినాడ శేషు, తలారి శంకర్, అక్కిరెడ్డి కనకరాజు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ అభ్యాసకులకు పరీక్షలు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని 35 గ్రామ పంచాయతీల పరిధిలో వెలుగు విఓఎ ల ద్వారా గ్రామాల్లో గుర్తించబడిన 530 మంది మహిళలకు ఉల్లాస్ అక్షరాస్యత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల ఆంధ్రప్రదేశ్ వయోజన విద్యాశాఖ అమరావతి వారు ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో నమోదు చేయబడిన అభ్యాషకులకు ఫ్లనాట్ అసెస్మెంట్ టెస్ట్ ను ఈ నెల 23 న నిర్వహించుటకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి,వెలుగు ఏపిఎమ్ టి.రాజుబాబు సంబంధిత అధికారులతో కలిసి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుచ్చయ్యపేట మండలంలోని 35 గ్రామ పంచాయతీల పరిధిలోనున్న డ్వాక్రా, ఎమ్డిఎమ్ లో గుర్తించిన 530 మంది అభ్యాసకులకు ఆయా గ్రామాలలోనే అంగన్వాడీ కేంద్రాలలో పరీక్షల వ్రాసేందుకు ఏర్పాటు చేశారు. ఇందుకు 38 అంగన్వాడీ కేంద్రాలను గుర్తించారు. పరీక్షలు సజావు గా నిర్వహించేందుకు సిబ్బందిని నియమించారు. ఇన్ విజిలేటర్లుగా అంగనవాడి కార్యకర్తలను నియమించారు. మండలంలోని 530 మంది అభ్యాసకులకు పరీక్ష పట్ల అవగాహన కల్పించి ఈ నెల 23వ తేదీన జరిగే పరీక్షకు హాజరయ్యేలా చూడాలని స్థానిక సిబ్బందికి ఆదేశించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వైఎస్సార్ పేరు తీసేశారు అనేదానికి ఆధారాలు చూపాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** సాక్షి టివి లోగోలో వైఎస్ఆర్ ఫోటో తీసేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదు. వైఎస్ఆర్ పేరుతో ఉండే పథకాలు జగన్ పేరు పెట్టినప్పుడు ఎందుకు హడావిడి చెయ్యలేదు. విశాఖలో ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియంకు వైయస్ఆర్ పేరును తీసేసారన్న దానికి ఆధారం ఏమిటో వైసిపి నేతల చూపించాలి. ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం దగ్గర వైయస్ఆర్ విగ్రహం ఉంది...పేరు ఉంది...అక్కడే వైసిపి నేతలు నిరసన వ్యక్తం చేశారు.ఈ స్టేడియం లో ఐపిఎల్ మ్యాచ్ ఈ నెలలో జరగనుంది...టికెట్స్ మీద కూడా వైఎస్ఆర్ పేరు ఉంది.గుడివాడ అమర్నాథ్ రెడ్డుం ప్రభుత్వ కంటి ఆసుపత్రికి వెళ్లి కళ్ళ పరీక్షలు చేయింకొని...ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి.గుడివాడ అమర్నాథ్ చిల్లర వేషాలు మాని..మా ప్రశ్నకు సమాధానం చెప్పాలన్నినారు. కెటర్స్ వచ్చిన ప్రతి సారి ఇలా పరువు తీసే పని చేస్తారు వైసీపీ నేతలు..ఎయిర్ పోర్ట్ దగ్గర క్రికెటర్ల బస్సు మీద రాళ్ళ దాడి చేశారు...వైసీపీ ఉత్తర ఇంచార్జి కె కె రాజు.ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ లో కేసు కూడా నమోదు అయ్యింది.కేవలం ఉనికి చాటుకోవడానికి వైసిపి బతికి ఉంది.ఇక్కడ కొందరు నాయకులు ఉన్నాం అని చెప్పడానికి స్టేడియం దగ్గర నిరసనలు చేసారు.ఇదే అమర్ సేవ్ వైజాగ్ అని అరిచాడు..సేవ్ వైజాగ్ కాస్త...షేవ్ వైజాగ్ చేసేసారు వైసీపీ నేతలు.అమర్ నిరసన విజయసాయి కబ్జా చేసిన భూములు దగ్గర చెయ్యాలి..విశాఖ ఇమేజ్ ను డామేజ్ చెయ్యడం వైసిపి లక్షణం..పెద్ద క్రికెట్ మాచ్ లు జరుగుతాయి...ఆ సమయంలో వైసీపీ నేతలు హడావిడి చేసి...అమర్ విశాఖ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బతీస్తున్నారు. అమర్ తన ఉనికిని కాపాడుకోవాలని చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నాడు.గుడివాడ అమర్ నాథ్,వైసిపి నేతలు శవ రాజకీయాలు చేస్తున్నారు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే...కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు...మీకు తగిన బుద్ధి చెప్తుందన్నారు.

## బకాయిల చెల్లింపు కోరుతూ కాంట్రాక్టర్ల ఆందోళన



**కాకినాడ రూరల్ (విశాఖ సమాచారమ్):-** వివిధ నిర్మాణ పనులలో గత ఆరు సంవత్సరాలుగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని తక్షణమే బకాయిలు చెల్లించాలని కోరుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు.ఈసందర్భంగా కాంట్రాక్టర్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎస్.శాంతారామ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు మరియు కుటుంబ పోషించుకోవడంలో ఇబ్బందులు కారణంగా మార్చి, 2025 నాటికి మా బకాయి బిల్లులకు అవసరమైన చెల్లింపులు అందకపోతే,తిరిగి టెండర్లు వేయడం మరియు పనులను చేయలేని స్థితిలో ఉన్నామన్నారు.తమ సమస్యలను పరిష్కరించడానికి, పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించడానికి వీలుగా సీఎఫ్ఎమ్మెస్ %డ%నిధి పోర్టల్లోని సాంకేతిక అడ్డంకులను పరిష్కరించడంతో పాటు,ఏజ్ వైజ్ ఫిఫో ప్రాతిపదికన బకాయిల క్లియరెన్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ & బి విభాగంలో 1,350 కోట్లు,నాబార్డుతో సహా వివిధ ప్రణాళికల కింద నిధుల క్లియరెన్స్ చేయాలన్నారు. అదనంగా బడ్జెట్ కేటాయింపు లేకపోవడం వల్ల అప్లోడ్ చేయని బిల్లులు మొత్తం రూ. 500 కోట్లు,పంచాయతీ రాజ్ విభాగంలో పెండింగ్లో ఉన్న చెల్లింపులు:రూ. 800 కోట్లు,అదేవిధంగా అదనంగా రూ.500 కోట్లు బడ్జెట్ పరిమితుల కారణంగా (ఎఎంసి గ్రాంట్తో సహా) అప్లోడ్ చేయని బిల్లులను కలిగి ఉంటాయన్నారు.ఇతర రంగాలలో పెండింగ్ చెల్లింపులు: రూ.5,000 కోట్లు క్లియరెన్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి కాంట్రాక్టర్స్, మునిసిపల్ కాంట్రాక్టర్స్, సబకా అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



**పాడేరు, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ వనుము చిట్టిబ్బాయి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేస్తున్నారని మరింత అవగాహన కలిగి రక్త దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గిరిజన రోగులకు రక్తం లేని పరిస్థితిలో ప్రాణాపాయం రాకుండా కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని అన్నారు. స్వతంత్ర సమరయోధుల త్యాగానికి నివాళి అర్పిస్తూ నిఫా, ఎన్జీవో రెడ్ క్రాస్ సంయుక్తంగా ఈనెల 30 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. అపోహలను విడనాడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఔత్సాహితులకు పిలుపునిచ్చారు. అలాగే శనివారం (నేడు) జరగబోయే చింతపల్లి డిగ్రీ కళాశాల రక్తదాన శిబిరాన్ని కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా సందర్శించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం ఆనందదాయకమని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలని కోరారు. సమాజంలో దుష్ప్రభావాలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తృతం చేస్తున్నారని కమిటీ సభ్యులను ప్రశంసించారు. 16 సారీ రక్తదానం చేసిన విద్యార్థి కీ సన్మానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి 41 యూనిట్లు రక్తాన్ని సేకరించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కార్యదర్శి జి గౌరీ శంకర్, కోశాధికారి పి సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి ప్రసాద్ నాయుడు, సంజీవరావు, రవి, జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, సుధాకర్, శ్యాంసుందర్, గంగారావు, కళాశాల సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి జగదీష్ పాడె మోసిన నాగ జగదీష్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దొడ్డి జగదీశ్వరరావు అనకాపల్లి పార్లమెంట్ టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు పాత మున్సిపల్ 16 వార్డు వార్డు అధ్యక్షులుగా పనిచేశారు. గత కొంతకాలంగా గొంతు వ్యాధితో బాధపడుతూ విశాఖపట్నం ఆసుపత్రి లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున స్వర్గస్తులయ్యారు. మధ్యాహ్నం 1: 15 గంటలకు అంతిమయాత్ర నిదానం దొడ్డి కరెంట్ ఆఫీస్ వీధిలో వారి స్వగృహం నుండి అంతిమయాత్ర బయలుదేరింది. అంతకుముందు మాజీ శాసన మండల సభ్యులు నాగ జగదీష్ దొడ్డి జగదీష్ పార్థవదేహంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ దొడ్డి జగదీష్ తెలుగుదేశం పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్త నుండి నాయకుడిగా వార్డులో మంచి పేరు ప్రత్యేకత గుర్తింపు తెచ్చుకున్నారని, సంక్షేమ పథకాలు పెన్షన్, రేషన్ కార్డ్, డ్వాక్రా గ్రూపులు, కుట్టు మిషన్లు,టి డ్కో గృహాలు బడుగు బలహీన వర్గాలకు సహాయ సహకారాలు అందించి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందే విధంగా కృషి చేశారని అటువంటి వ్యక్తి చనిపోవడం తెలుగుదేశం పార్టీకి తీరనిలోటుని తన సేవలు పార్టీ కోల్పోయిందని అతను పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని నాగ జగదీశ్వరరావు అన్నారు. అనంతరం జగదీష్ అంతిమయాత్రలో గవరపాలెం స్మశానం వరకూ పాడి మోసారు. జగదీష్ పార్థవదేహానికి నివాళులర్పించిన వారిలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు కొణతాల వెంకటరావు బొలిశెట్టి శ్రీనివాసరావు కోట్ని రామకృష్ణ కుప్పిలి జగన్ బోడి వెంకటరావు సబ్బవరపు గణేష్ కాండ్రేగుల సత్యనారాయణ పొలిమేర నాయుడు బొడ్డేడ మురళి బొడ్డేడ శ్రీనివాసరావు విల్లూరి రమణబాబు కాండ్రేగుల రవీంద్ర మల్ల గణేష్ దూలం ప్రసాద్ డివివి అప్పారావు కోరిబిల్లి మహాలక్ష్మి నాయుడు సాలాపు నాయుడు ఆడారి రమణబాబు మారిశెట్టి శంకర్రావు వేగి కృష్ణ మల్ల రామకృష్ణ సూరిశెట్టి బల్లమ్మ కర్రీ మల్లేశ్వరరావు పిన్నింటి కనకారావు జామి శంకర్రావు గొర్లి కృష్ణ మైపాలి శ్రీనివాసరావు పెంటకోట శ్రీను పిల్లా తారకేశ్వరరావు సూరే సతీష్ దాడి వేణు బుద్ధ భువనేశ్వర్రావు దాడి వేణు మారిశెట్టి బాల పెంటకోట శివరాం సూరిశెట్టి శివ విల్లూరి సత్తిబాబు గుర్రాల వాసు సారిపల్లి శ్రీనివాసరావు సరిసా నాగు తదితరులు ఉన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**గొలుగొండ, (విశాఖ సమాచారమ్):-** చిడిగుమ్మల గ్రామ పంచాయతీ అద్యరయంలో శుక్రవారం చలివేద్రం ఏర్పాటు చేసారు.పంచాయతీ కార్యదర్శి గౌరీ,సచివాలయం సిబ్బంది కలిసి చలివేద్రం కు వచ్చి పోయిన ప్రయాణికులు కు వాహణదారులకు చల్లని మజ్జిక పంపిణి చేసారు.

## కుళాయిల ఏర్పాటుకు పరిశీలన

**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** జి మాడుగుల మండలం కోరాపల్లి పంచాయితీ కోరాపల్లి గ్రామంలో ఈ రోజు వాటర్ కొళాయిలు ఏర్పాటు చేయుట కొరకు వాటర్ సోర్స్, ట్యాంక్ ఏర్పాటు కొరకు పరిశీలించడం జరిగింది దీనిలో పాల్గొన్నవారు సూపర్ సర్పంచ్ పెదబాలన్న, సూపర్ ఎంపీటీసీ వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ యువనాయకులు కోరాబు శ్రీనువాస నాయుడులి, పేసా కమిటీ సభ్యులు కోరాబు చిట్టి నాయుడు, వంతాల దేవినాయుడు, వార్డ్ నెంబర్ కోరాబు స్వామి నాయుడు కోరాపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్ పునఃప్రారంభం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** పరవాడ మండలం ఈ బోనంగి పంచాయతీ ఫార్మాసిటీ కాలనీ నందు ఫార్మా జెల్ పరిశ్రమ యాజమాన్యం 9 సంవత్సరములు క్రితం నిర్మించిన ఆర్ఓ ప్లాంట్ మరమ్మత్తులకు గురైంది. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు పరిశ్రమ యజమానులకు తెలియపరచగా శుక్రవారం 2.50 లక్షల రూపాయలతో మరమ్మత్తులు చేపట్టి గ్రామపంచాయతీకి తాళాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సూర్యదేవర అప్పారావు, సి ఎస్ ఆర్ ఇన్చార్జి రవి , ఎండిఓ ధర్మారావు , జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు , మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు , చందక గోవిందరాజు, చందక కృష్ణ, అట్ట నూకరాజు, పంచాయతీ కార్యదర్శి, గడసాల శ్రీను, గొల్లవిల్లి సతీష్, కోమటి కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి నీటి పరిరక్షణ - పోస్టర్ ఆవిష్కరణ

**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** కలెక్టర్ చాంబర్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన మంచి నీటి పరి రక్షణ-పంచ సూత్రాలు, జల్ జీవన్ మిషన్ - వర్కింగ్ ప్రాసెస్, విడబ్ల్యుఎస్ సి -విధులు భాధ్యతలు, సుజల సూక్తులు, వాష్ కార్యక్రమాలు మొదలగు ఐదు రకాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని తద్వారా ఆరోగ్యకర సమాజానికి దోహద పడదాలని సూచించారు. అదేవిధంగా నీటిని వృధా చేయరాదని, ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వోఓ కె. పద్మామలత ఖ జిల్లా నవ నిర్మాణ సమితి కార్యదర్శి ఎ రఘురామ్, సీనియర్ మేనేజర్లు కే. రవికుమార్, వివిఎస్ఎస్ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పి 4 పోస్టర్ ఆవిష్కరణ

**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన 20 వేల మంది విద్యార్థులతో యోగ సాధన కార్యక్రమంపై జరిగిన సమావేశం అనంతరం రాష్ట్ర ప్రణాళిక శాఖ రూపొందించిన పి4 పోస్టర్ (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టిసిపేషన్) ను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదరికం లేని సమాజ0 నిర్మాణానికి పి 4 సర్వే ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ ఈ సర్వే కు సహకరించాలని కోరారు. స్వర్ణాంధ్ర -2047 లో భాగంగా సమాజంలో ఉన్న 20 శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి పి 4 సర్వే ద్వారా టాప్ 10 శాతం తెలుగు ప్రవాసులు, అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని స్థాపించదానికి ప్రభుత్వం శ్రీకార0 చుట్టిందని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డా. ఎంజే అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కే. పద్మలత, డిఎస్పి షెహబాజ్ అహ్మద్, సిపిఒ ఎస్ఎస్ఆర్ కే పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎర్త్ అవర్ పాటించండి : గవర్నర్ పిలుపు



**అమరావతి బ్యూరో :** వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఎర్త్ అవర్ గ్లోబల్ ఉద్యమంలో భాగంగా మార్చి 22న రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఒక గంట పాటు అన్ని అవసరమైన లైట్లను స్వచ్ఛందంగా ఆపి వేసి ఎర్త్ అవర్ పాటించాలని గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. వాతావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ ఏకం చేస్తూ భవిష్యత్తు తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించడంలో ఈ కార్యక్రమం సహాయపడుతుందని గవర్నర్ పేర్కొన్నారు.

# క్రీడా సమాచారమ్

## ఈ కుర్రాళ్లపై కన్నేయండి!



ఐపీఎల్ అనగానే అభిమానులంతా పెద్ద స్టార్లు ఎలా ఆడతారా అని ఎదురు చూస్తుంటారు. వాళ్ల ప్రదర్శనపై ఎన్నో అంచనాలు పెట్టుకుంటారు. కానీ ప్రతి జట్టులో కొంతమంది ప్లేయర్లు ఉంటారు. వాళ్ల గురించి ఫ్యాన్స్‌కు పెద్దగా తెలియదు. వాళ్లను పట్టించుకోరు కూడా. అయితే ఏదో ఒక మ్యాచ్‌లో అదిరే ఆటతో తమ ముద్ర వేస్తారీ ఆటగాళ్లు. రాత్రికి రాత్రే స్టార్లు కూడా అయిపోతారు. ఐపీఎల్-18లో అలా మెరిసే అవకాశమున్న కుర్రాళ్ల గురించి తెలుసుకుందాం.

**దక్షిణాఫ్రికా కెరటం**

**ర్యాన్ రికిల్‌టన్**

2019, 2020 ఐపీఎల్‌లో అప్పటి ముంబయి ఇండియన్స్ కెప్టెన్ రోహిత్‌శర్మతో కలిసి దక్షిణాఫ్రికా వికెట్‌కీపర్ బ్యాటర్ క్వింటన్ డికాక్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. వీళ్లిద్దరిది హిట్ పెయిర్. 2025లో రోహిత్ మరోసారి ఓ దక్షిణాఫ్రికా వికెట్‌కీపర్ బ్యాటర్‌తో ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. అతడే ర్యాన్ రికిల్‌టన్ . అంతర్జాతీయ తెరపైకి దూసుకొచ్చిన ఈ యువ బ్యాటర్ ముంబయి రూ.కోటి పెట్టి దక్కించుకుంది. ఎస్‌ఏ20 టోర్నీలో ముంబయి కేప్‌టౌన్ టైటిల్ గెలవడంలో రికిల్‌టన్‌ది కీలకపాత్ర. అతడు 177పైన స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధించాడు. గతేడాది మేజర్ లీగ్ క్రికెట్లో సీటెల్ ఆర్కాస్‌కు ఆడుతూ 63 బంతుల్లోనే శతకం బాదాడు. అంతర్జాతీయ స్థాయిలోనూ రికిల్‌టన్‌కు మంచి అనుభవమే ఉంది. ఇప్పటిదాకా 10 టెస్టులు, 9 వన్డేలతో పాటు 13 టీ20లు ఆడాడు. ఈ అనుభవాన్ని.. ఫామ్‌ని ఐపీఎల్‌నూ చూపిస్తాడేమో చూడాలి.

**బెతెల్.. ఓ ఆయుధం**

**జాకబ్ బెతెల్**

జాకబ్ బెతెల్ .. ఒక్క ఏడాదిలోనే ఈ కుర్రాడి పేరు అంతర్జాతీయ క్రికెట్ తెరపైకి వచ్చింది. బార్బడోస్‌లో పుట్టినా ఇంగ్లాండ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న 21 ఏళ్ల ఈ ఆల్‌రౌండర్.. దూకుడైన బ్యాటింగ్‌కు పేరు. అండర్-19 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ ఫైనల్ చేరడంలో బెతెల్ కీలకపాత్ర పోషించాడు. బ్యాట్‌తోనే కాదు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తోనూ సత్తా చాటగలడు. అతడు మెరుపు ఫీల్డర్ కూడా. ఇంతటి నైపుణ్యమున్న బెతెల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ.2.60 కోట్లు పెట్టి దక్కించుకుంది. భారత్‌తో సిరీస్‌లో గాయపడినా కూడా బెతెల్ కోలుకుని ఇటీవలే ఆర్సీబీ శిబిరంలో చేరాడు. మరి ఎంతో ప్రతిభ ఉన్న అతడిని ఆర్సీబీ ఎలా ఉపయోగించుకుంటుందో చూడాలి.

**బ్రీట్జ్‌కే అదరగొడతాడా!**

**బ్రీట్జ్‌కే**

వన్డేలో ఆడిన తొలి ఇన్నింగ్స్‌తోనే అందర్ని తనవైపు తిప్పుకున్నాడు మాథ్యూ బ్రీట్జ్‌కే . పాకిస్థాన్‌లో ముక్కోణపు సిరీస్‌లో న్యూజిలాండ్‌పై 150 పరుగులు సాధించిన ఈ కుడిచేతి వాటం ఆటగాడు.. అరంగేట్ర వన్డేలోనే అత్యధిక స్కోరు సాధించిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. దూకుడుగానే ఆడుతూ స్థిరంగా ఇన్నింగ్స్ నిర్మించడం బ్రీట్జ్‌కే ప్రత్యేకత. గతేడాది ఎస్‌ఏటీ20 టోర్నీలోనూ అతడు ఇదే జోరు ప్రదర్శించాడు. అందుకే ఐపీఎల్ మెగా వేలంలో లఖ్‌నవూ అతణ్ని సొంతం చేసుకుంది.

**13 ఏళ్లకే..**

**వైభవ్**

పాప్‌కార్న్ తింటూ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు చూసే వయసు వైభవ్ సూర్యవంశీది. కానీ ఈ కుర్రాడు ఏకంగా ఐపీఎల్ టోర్నీలోనే ఆడేస్తున్నాడు. ప్రతిభావంతుడైన ఈ టీనేజర్‌ను రాజస్థాన్ రాయల్స్ వేలంలో ఏకంగా రూ.1.10 కోట్లు పెట్టి దక్కించుకోవడం మరో విశేషం. ఇటీవల భారత్ అండర్-19కి ఆడుతూ ఆస్ట్రేలియా అండర్-19 జట్టుపై 58 బంతుల్లోనే సెంచరీ సాధించిన వైభవ్.. విజయ్‌హజారే ట్రోఫీలో బిహార్ తరఫున 42 బంతుల్లో 71 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వైభవ్.. 12 ఏళ్లకే రంజీ ట్రోఫీ ఆడి అందరి దృష్టిలో పడ్డాడు. రంజీ బరిలో దిగిన రెండో పిన్న వయస్కుడతనే. ఇప్పటిదాకా కేవలం 5 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లే ఆడినా దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తుది జట్టులో అతడికి చోటు దక్కుతుందా లేదా అనేది ఆసక్తికరం. యువ ప్లేయర్లను పరీక్షించడంలో ముందుండే ఆ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్.. వైభవ్‌ని ఇంపాక్ట్ ప్లేయర్‌గానైనా ఆడించే అవకాశాలున్నాయి.

**తమ్ముడూ గట్టోడే**

**ముషీర్‌ఖాన్**

సర్ఫరాజ్‌ఖాన్.. చాలా ఏళ్ల క్రితమే అతడు ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. దేశవాళీలో పరుగుల వరద పారించి ఆలస్యంగానైనా భారత జట్టుకు ఎంపికయ్యాడు. ఇప్పుడు అన్న సర్ఫరాజ్ బాటలోనే తమ్ముడు ముషీర్‌ఖాన్ ముందుకెళ్తున్నాడు. 2024 అండర్-19 ప్రపంచకప్ విజయంలో కీలకపాత్ర పోషించిన 20 ఏళ్ల ఈ ఆల్‌రౌండర్‌ను.. ఐపీఎల్ వేలంలో పంజాబ్ కింగ్స్ రూ.30 లక్షలకు సొంతం చేసుకుంది. అన్న మాదిరే దేశవాళీలో పరుగుల వరద పారిస్తున్న ముషీర్.. ఆడిన 9 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 3 శతకాలు బాదాడు. గతేడాది ముంబయి తరఫున రంజీ ట్రోఫీ అరంగేట్రంలోనే ద్విశతకం సాధించాడు. బ్యాటింగ్‌లోనే కాదు తన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తో మ్యాచ్‌లు మలుపు తిప్పగల సత్తా అతడికుంది. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లపై ముషీర్‌ని అయిదో బౌలింగ్ ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవాలనేది కోచ్ రికీ పాటింగ్ ఆలోచన. మరి ఛాన్స్ దొరికితే ముషీర్ రాణించగలడా అనేది చూడాలి.

**పవర్ హిట్టర్**

**రాబిన్ మింజ్**

ప్రతిభావంతులను వెలికి తీసి స్టార్లుగా తయారు చేయడంలో ముంబయి ఇండియన్స్ ముందుంటుంది. ఈసారి రాబిన్ మింజ్ అనే ఒక కుర్రాడిని ఐపీఎల్‌లో పరీక్షించబోతోంది జట్టు. 22 ఏళ్ల ఈ జార?ండ్ పవర్ హిట్టర్. కొన్ని ఓవర్లలోనే మ్యాచ్ గమనాన్ని మార్చేగల సత్తా ఈ ఎడమచేతి వాటం బ్యాటర్‌కి ఉంది. అతడు వికెట్‌కీపర్ కూడా కావడంతో కూర్పులోనూ ముంబయికి ఇబ్బంది ఉండకపోవచ్చు. ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వెళ్లడంతో ఇప్పుడు రాబిన్‌ను అతడికి ప్రత్యామ్నాయంగా తయారు చేయాలనేది ముంబయి ప్రయత్నం. రూ.65 లక్షలకు ముంబయికి సొంతమైన రాబిన్ ఇప్పటిదాకా రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు.

## ఐపీఎల్ 2025.. టాప్ - 4లో ఎవరు ఉండొచ్చంటే?



**ఇంటర్నెట్ డెస్క్:**

భారీ మార్పులతో ఈసారి ఐపీఎల్‌లోకి పది జట్లు అడుగుపెట్టాయి. ఎవరు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. సీజన్ ప్రారంభానికి ముందే పలువురు మాజీలు తమ అంచనాలను వెల్లడించారు. ప్రపంచంలోనే మెగా లీగ్‌కు వేళైంది. శనివారం నుంచి ఐపీఎల్ 2025 మొదలుకానుంది. తొలి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగనుంది. ఈసారి ఏయే జట్లు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటాయో ఇప్పుడే చెప్పడం కష్టమే. కానీ, మాజీ క్రికెటర్లు మాత్రం తమ అంచనాలతో వచ్చేశారు. భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, మైకెల్ వాన్, ఆడమ్ గిల్‌క్రిస్ట్, షాన్ పొలాక్ తదితరులు స్పందించారు. వీరెవరూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఎంపిక చేయకపోవడం గమనార్హం. ఎక్కువమంది సీఎస్కే వైపూ మొగ్గు చూపలేదు. రోహన్ గావస్కర్, హర్షా భోగ్లే ఆర్సీబీని సెలక్ట్ చేశారు.

**ఎవరు ఏం చెప్పారంటే?**

వీరేంద్ర సెహ్వాగ్: ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్

ఆడమ్ గిల్‌క్రిస్ట్: పంజాబ్ కింగ్స్, ముంబయి, సన్‌రైజర్స్, గుజరాత్ టైటాన్స్

రోహన్ గావస్కర్: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, దిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్

హర్షా భోగ్లే: ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

షాన్ పొలాక్: ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్

మనోజ్ తివారీ: సన్‌రైజర్స్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా

సైమన్ డౌల్: చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్

మైకెల్ వాన్: గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్

## ఐపీఎల్ వేలంలో అన్‌సోల్డ్..

**కట్ చేస్తే పంత్ టీమ్‌లోకి ఎంట్రీ?**



ఐపీఎల్-2025 ఆరంభానికి కేవలం కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలింది. మార్చి 22న ఈడెన్ గార్డెన్స్ కేకేఆర్-ఆర్సీబీ మధ్య జరగనున్న మ్యాచ్‌తో ఈ మెగా ఈవెంట్‌కు తెరలేవనుంది. ఈ క్రమంలో మొత్తం పది ఫ్రాంచైజీలు గాయాల కారణంగా దూరమైన ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసే పనిలో పడ్డాయి.

లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ టీమిండియా వెటరన్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌కు దూరమైన లక్నో పాస్ట్ బౌలర్ మొహ్సిన్ ఖాన్ స్థానంలో శార్దూల్‌ను తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే శార్దూల్ ఠాకూర్ వైజాగ్‌లో ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌తో కలిసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

ఈ టోర్నీలో లక్నో సూపర్ జెయింట్స్ తమ తొలి మ్యాచ్‌లో ఈ నెల 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆడనుంది. కాగా ఐపీఎల్-2025 మెగా వేలంలో శార్దూల్ ఠాకూర్ అమ్ముడు పోలేదు. రూ. 2 కోట్ల బేస్‌ప్రైస్‌తో వేలంలోకి వచ్చిన అతడిని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు.

కానీ ఇప్పుడు మరోసారి అతడికి ఐపీఎల్‌లో భాగమయ్యే అవకాశం లక్నో జట్టు కల్పించింది.

## రహదారులకు నిధులు మంజూరు చేయండి

### రూ.150 కోట్లు ఇవ్వాలని మంత్రి సంధ్యారాణి కోరిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** పాడేరు నియోజకవర్గంలో వివిధ రహదారుల నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన శాఖ మాత్యులు శ్రీమతి గుమ్మడి సంధ్యారాణిని మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. అమరావతిలోని సచివాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పాడేరు నియోజకవర్గంలో సమస్యలను వివరించారు. పాడేరు నియోజకవర్గంలో సుమారుగా రూ.200 కోట్లకు పైబడి రోడ్ల నిర్మాణానికి నిధులు అవసరం ఉన్నాయని ఇప్పటికిప్పుడు రూ.150 కోట్లైన సరే మంజూరు చేయాలని ఆమె కోరారు. దీంతోపాటు పాడేరు పట్టణ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన నిధులు కూడా మంజూరు చేయాలని విన్నవించారు. చాలా గ్రామాలు వేసవి సమీపించిన నేపథ్యంలో తాగునీటి సమస్య ఇబ్బంది పడుతున్నాయని ఆ సమస్య పరిష్కారానికి నిధులను విడుదల చేయాలని మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు.

**ఓంశాంతి మందిరానికి నిధులు విడుదల చేయండి**

ఓంశాంతి మందిర నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని గిడ్డి ఈశ్వరి కోరారు. ఓం శాంతి ప్రతినిధులతో కలిసి మంత్రి సంధ్యారాణి ని కలిశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో దీనికి సంబంధించిన నిధులను విడుదల చేస్తామని చెప్పినా విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. మంత్రి చొరవ తీసుకొని మందిర నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు విడుదల చేయాలని విన్నవించారు.

**వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలు చెల్లించండి**

పాడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది కి ప్రోత్సాహకాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి గిడ్డి ఈశ్వరి తెలిపారు. 24 గంటలు ప్రజల కోసం సేవలందించే వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించడంలో నిర్లక్ష్యం చూపొద్దని వెంటనే బకాయి పడ్డ ఇన్సెంటివ్ విడుదల చేయాలని కోరారు.

## రాగోలపల్లిలో వసంత విషువత్తు దినోత్సవం



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):-** రాగోలపల్లి పరిషత్ ప్రాథమిక పాఠశాల రాగోలపల్లిలో శుక్రవారం వసంత విషువత్తు దినోత్సవం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా విషువత్తు గురించి వివరించారు.

విషువత్తు అంటే పగలు, రాత్రి సమాన కాలం ఉండే రోజు. సంవత్సరంలో రెండు విషువత్తులు వస్తాయి - వసంత విషువత్తు (మార్చి 20/21) మరియు శరద్ విషువత్తు (సెప్టెంబర్ 22/23).

వసంత విషువత్తు రోజున, సూర్యుడు భూమధ్య రేఖను దాటి ఉత్తరార్ధగోళంలోకి ప్రవేశిస్తాడు. ఇది ఉత్తరార్ధగోళంలో వసంత ఋతువు ప్రారంభాన్ని, దక్షిణార్ధగోళంలో శరదృతువు ప్రారంభాన్ని సూచిస్తుంది.

ఈ రోజున పగలు-రాత్రి తిరగబడే ప్రక్రియ జరుగుతుంది - ఉత్తరార్ధగోళంలో పగలు సమయం పెరగడం ప్రారంభమవుతుంది, దక్షిణార్ధగోళంలో రాత్రి సమయం పెరగడం మొదలవుతుంది.

ఖగోళశాస్త్రపరంగా, ఈ రోజున సూర్యుడు భూమధ్యరేఖను దాటి మేష రాశిలోకి ప్రవేశిస్తాడు. అనేక సంస్కృతులలో ఈ దినం కొత్త సంవత్సరం ప్రారంభంగా భావిస్తారు.

ప్రపంచవ్యాప్తంగా, వసంత విషువత్తు వివిధ రకాల సాంస్కృతిక వేడుకలతో ముడిపడి ఉంది - ఇరాన్‌లో నౌరోజ్, హిందూ సంప్రదాయంలో ఉగాది, రోమ్‌లో అన్నా పెరెన్నా వంటివి అని వివరించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆయా కుమారి, మ.భో.కార్మికురాలు వరలక్ష్మి ఉన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి ఈ నంబర్లకు యూపీఐ సేవలు బంద్



**ఇంటర్నెట్ డెస్క్:** ఇన్‌యాక్టివ్ లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు.. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని సూచించింది. యూపీఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. ఈ సేవల్లో ఓటీపీ వెరిఫికేషన్ కీలక భూమిక పోషిస్తుంది. అందుకే ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

ఎక్కువకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికాం కంపెనీలు వేరొకరికి కేటాయిస్తుంటాయి. దీంతో దీర్ఘకాలం పాటు మనం వాడే నంబర్లు వేరొకరికి చేరుతుంటాయి. దాంతో యూపీఐ ఖాతాలు కూడా వారి చేతిలోకి వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి.

**ఏం చేస్తారు?**

ఇన్‌యాక్టివ్‌లో ఉన్న, ఇతరులకు అసైన్ చేసిన, డీయాక్టివ్ చేసిన మొబైల్ నంబర్లు బ్యాంకులు, పేమెంట్ ప్రొవైడర్లు తొలగిస్తాయి. ఒకవేళ అందులో మీ నంబర్ ఉంటే.. యూపీఐ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు నోటిఫికేషన్ పంపిస్తాయి. నోటిఫికేషన్ తర్వాత కూడా నంబర్ ఇన్‌యాక్టివ్‌లోనే ఉంటే మోసాలను అరికట్టేందుకు యూపీఐ నంబర్లను బ్యాంకులు డీలిస్ట్ చేస్తాయి.

**ఎవరిపై ప్రభావం?**

మొబైల్ నంబర్ మార్చినా బ్యాంకుల వద్ద ఆ నంబర్‌ను అప్‌డేట్ చేయని వారి మీద ప్రభావం ఉంటుంది.

యూపీఐతో లింక్ చేసి కాల్స్, ఎస్సెమ్మెస్‌లు వంటివేవీ చేయకుండా దీర్ఘకాలం పక్కనపెట్టిన వారు

బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయకుండా మొబైల్ నంబర్‌ను సరెండర్ చేసినవారు అవాంతరాలు ఎదుర్కొంటారు.

పాత నంబర్‌ను వేరొకరికి అసైన్ చేసిన సందర్భాల్లో పాత నంబర్ హోల్డర్లపై ఈ ప్రభావం ఉంటుంది.

**యూపీఐని యాక్టివ్‌గా ఉంచుకోవాలంటే?**

మీ నంబర్ యాక్టివ్‌గా ఉందో, లేదో చెక్ చేసుకోండి. కాల్స్, మెసేజులు వెళ్తున్నాయో, లేదో చూడండి.

బ్యాంక్ నుంచి ఓటీపీలు, ఎస్సెమ్మెస్ అలర్ట్‌లు వస్తున్నాయో, లేదో చెక్ చేసుకోండి.

బ్యాంకుల వద్ద మీ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోండి. నెట్‌బ్యాంకింగ్ లేదా బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేయొచ్చు.

## ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్..

### 2700 మంది పోలీసులతో భారీ భద్రత



**హైదరాబాద్:** మార్చి 22 నుంచి ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న వేళ రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. మార్చి 23న ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. మొత్తంగా 2700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షించనున్నారు.

మరోవైపు, స్టేడియం ఎంట్రన్స్ వద్ద స్నిపర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టనున్నారు. క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే మహిళల కోసం మహిళా భద్రతా విభాగం బృందాలను ఏర్పాటు చేశారు. అభిమానుల కోసం ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ల్యాప్‌టాప్, అగ్గిపెట్టెలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్ ఉన్న రోజుల్లో నగరంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు నడవనున్నాయి.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.